



Truth of News
RNI NO : APTEL/25/A0239

# సూర్య వాస్తవం

http://www.suryavastavam.in
చీఫ్ ఎడిటర్ : మొఘల్ ఇర్షాద్ బేగ్

IRS PUBLICATIONS
irspublications12@gmail.com

సంపుటి: 01 | అన్నమయ్య జిల్లా | సంచిక : 275 | శనివారం 28 మార్చి 2026 | పేజీలు : 8 | వెల రూ.6.50

Circulated from Hyderabad, Vishakapatnam, Rajahmundry, Vijayawada, Guntur, Nellore, Tirupati, Anantapuram, kadapa, kurnool, Warangal, Karimnagar, Nalgonda, Chennai, Bengalore, Mumbai, New Delhi

## రాష్ట్రాల సన్నద్ధతపై సమీక్ష

**- పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధాని నరేంద్ర మోడీ సమావేశం**



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు కొనసాగుతున్న నేపథ్యంలో ప్రధాని నరేంద్ర మోడీ పలు రాష్ట్రాల ముఖ్యమంత్రులతో శుక్రవారం వర్చువల్‌గా సమావేశమయ్యారు. ఎన్నికలు జరుగుతున్న పశ్చిమ బెంగాల్, తమిళనాడు, కేరళ, అస్సాం, పుదుచ్చేరి ముఖ్యమంత్రులు మినహా మిగిలిన వారితో వీడియో కాన్ఫరెన్స్‌లో మాట్లాడారు. యుద్ధంతో ఇంధన సంక్షోభం కొనసాగుతున్న తరుణంలో రాష్ట్రాల సన్నద్ధతపై, వారి ప్రణాళికలపై సమీక్ష జరిపారు.

- మిగతా 2లో..

## ఆర్థిక బిల్లు రాజ్యసభలో ఆమోదం

**-- ఎన్నికల అనంతరం**
**- ఇంధన ధరలు పెరుగుతాయి : ప్రతిపక్షాలు**



న్యూఢిల్లీ - సూర్య వాస్తవం:

కొత్త ఆర్థిక సంవత్సరానికి గాను రూ. 53.47 లక్షల కోట్ల వ్యయం సిఫార్సులతో కూడిన ఆర్థిక బిల్లును పార్లమెంటు ఆమోదించింది. 32 సవరణలతో లోక్‌సభలో ఆమోదం పొందిన ఈ బిల్లుపై శుక్రవారం రాజ్యసభలో క్లుప్తంగా చర్చ జరిగింది. చర్చ పూర్తవడంతో బిల్లును తిరిగి లోక్‌సభకు పంపారు. ఆర్థిక మంత్రి నిర్మలా సీతారామన్ ప్రశ్నలకు సమాధానమిచ్చారు. పశ్చిమ ఆసియా ఘర్షణల నేపథ్యంలో కూడా దేశం పెట్రోల్, డీజిల్ ధరలను అదుపులో ఉంచగలిగిందని మంత్రి పేర్కొన్నారు. ఎల్‌పిజి సంక్షోభ సమయంలో మధ్యతరగతి, నిరుపేద వర్గాలకు సహాయం చేయడానికి

- మిగతా 2లో..



# పెరుగుతున్న ఉద్రిక్తతలు

**- చర్చలంటూనే అమెరికా, ఇజ్రాయిల్ దాడులు**
**- రెండు దేశాలకూ ఇరాన్ గట్టి సమాధానం**
**- గల్ఫ్‌లోని అమెరికా స్థావరాలపై స్ట్రైక్స్**
**- హార్ముజ్‌లో పాకిస్తాన్ జెండాతో అమెరికాకు చమురు ట్యాంకర్**
**- క్షిపణులతో దాడి చేసిన ఐఆర్‌జీసీ**
**- మరో పదిరోజులు యుద్ధానికి విరామం : ట్రంప్ ప్రకటన**
**- ఇజ్రాయిల్ సైన్యం కుప్పకూలే ప్రమాదం : ఐడీఎఫ్ చీఫ్ హెచ్చరిక**

వాషింగ్టన్, టెహ్రాన్ - సూర్య వాస్తవం

పశ్చిమాసియాలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి. అమెరికా, ఇజ్రాయిల్ చేస్తున్న దాడులు, హెచ్చరికలను ఇరాన్ ఏ మాత్రం లెక్క చేయట్లేదు. ప్రతిదాడులతో గట్టి సమాధానం చెప్తోంది. టెహ్రాన్‌లో బాలిస్టిక్ క్షిపణులు, ఇతర ఆయుధాల తయారీ స్థావరాలను లక్ష్యంగా చేసుకున్నట్టు ఇజ్రాయిల్ సైన్యం తెలిపింది. పశ్చిమ ఇరాన్‌లో క్షిపణి ప్రయోగ, నిల్వ కేంద్రాలపై కూడా దాడులు చేశామని ప్రకటించింది.

ఇక ఇరాన్.. యూఎస్ మిత్ర దేశాలపై విరుచుకుపడుతోంది. శుక్రవారం కూడా ఈ దాడులను కొనసాగించింది. బహ్రెయిన్, ఖతార్, యూఏఈ వంటి గల్ఫ్ దేశాలపై క్షిపణుల్ని ప్రయోగించింది. మరోవైపు పర్షియన్ గల్ఫ్‌లో మరోసారి ఉద్రిక్తతలు తారాస్థాయికి చేరాయి.


**అవి అమెరికాకు ఇచ్చిన కానుకలు:ట్రంప్**

ఇరాన్ తన ఇంధన కేంద్రాలు, చమురు నిల్వలపై దాడులను తప్పించుకోవాలంటే చర్చలు ఒక్కటే మార్గమని చెప్పారు. లేకుంటే వారి ఇంధన కేంద్రాలను నేలమట్టం చేస్తామని హెచ్చరించారు. "హార్ముజ్ జలసంధి నుంచి ఎనిమిది చమురు నౌకలను వెళ్లేందుకు ఇరాన్ అనుమతించింది. ఇది అమెరికాకు ఇరాన్ ఇచ్చిన 'కానుక' అని చెప్పుకొచ్చారు.

- మిగతా 2లో..

## పకడ్బందీగా పెట్రో ఉత్పత్తుల సరఫరా

**- రాష్ట్ర, జిల్లా స్థాయిలో కమిటీల ఏర్పాటు**
**- పీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో ముఖ్యమంత్రి రేవంత్ రెడ్డి**




హైదరాబాద్- సూర్య వాస్తవం:

రాష్ట్రంలో పెట్రోల్, డీజిల్, గ్యాస్ సరఫరాలో ఎలాంటి ఇబ్బందులు లేకుండా పకడ్బందీగా నిర్వహిస్తున్నట్టు ముఖ్యమంత్రి ఎనుముల రేవంత్‌రెడ్డి తెలిపారు. దేశంలో ఇందన సంక్షోభంపై అన్ని రాష్ట్రాల ముఖ్యమంత్రులతో ప్రధానమంత్రి నరేంద్ర మోడీ శుక్రవారం నిర్వహించిన వీడియో కాన్ఫరెన్స్‌లో సీఎం పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి పలు అంశాలను ప్రదాని దృష్టికి తీసుకెళ్లారు.

హైదరాబాద్‌లోని కమాండ్ కంట్రోల్ సెంటర్ నుంచి సీఎస్ ఆధ్వర్యంలోని కమిటీ పరిస్థితులను ఎప్పటికప్పుడు సమీక్షిస్తోందని తెలిపారు. 33 జిల్లాల్లోనూ గ్యాస్ సరఫరా, పెట్రోల్, డీజిల్

- మిగతా 2లో..

## మొక్కజొన్న ధరలో లోటు

# రైతులకు చెల్లిస్తాం

**-- అనుమతించాలని కేంద్రానికి ముఖ్యమంత్రి చంద్రబాబు లేఖ**




అమరావతి - సూర్య వాస్తవం

రాష్ట్రంలో మొక్కజొన్న రైతులను ధరల పతనం నుంచి కాపాడేందుకు మార్కెట్ ఇంటర్వెన్షన్ స్కీమ్ కింద ధరలో లోటును చెల్లించేందుకు కేంద్రం అనుమతిని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు కోరారు. ఈ మేరకు కేంద్ర వ్యవసాయశాఖ మంత్రి శివరాజ్ సింగ్ చౌహాన్‌కు ముఖ్యమంత్రి శుక్రవారం లేఖ రాశారు. రాష్ట్ర ప్రభుత్వం పంపిన ప్రతిపాదనలో మొక్కజొన్నకు కనీస మద్దతు ధర కంటే మార్కెట్ ధర తక్కువగా ఉన్న పరిస్థితిలో రైతులకు వ్యత్యాసం మొత్తాన్ని చెల్లించే విధంగా ప్రైస్ డెఫిషియన్సీ పేమెంట్ (పిడిపి) పథకం అమలు చేయాలని సూచించారు. ఈ పథకంలో 50:50 నిష్పత్తి బదులు 100 శాతం నష్టాన్ని కేంద్ర ప్రభుత్వం భరించాలని విజ్ఞప్తి చేశారు. అలాగే ప్రస్తుతం ఉన్న 25 శాతం కవరేజీని 100 శాతానికి పెంచాలని, ఈ పథకాన్ని జూన్ 2026 వరకూ అమలు చేయడానికి అనుమతి ఇవ్వాలని లేఖలో పేర్కొన్నారు. 2025-26 రబీ సీజన్‌లో రాష్ట్రంలో మొక్కజొన్న సాగు విస్తీర్ణం గణనీయంగా పెరిగిందని, 4.83 లక్షల హెక్టార్లలో

- మిగతా 2లో..

సూర్య వాస్తవం దినపత్రికలోని మరిన్ని వార్తల కోసం సంప్రదించండి

**- ట్రస్ట్ నిర్వహణలో దాతలు, సిబ్బంది సహకారం మరువలేనిది**
**- త్వరలో విజయవాడ, అనంతపురంలో తలసేమియా సెంటర్లు ఏర్పాటు**
**- తలసేమియా వ్యాధిపై అవగాహన కోసం మే 10న హైదరాబాద్‌లో ప్రత్యేక రన్**
**- మహిళలు ఆర్థికశక్తిగా ఎదగాలి**
**- కుప్పం నియోజకవర్గంలో ముగిసిన నారా భువనేశ్వరి 4 రోజుల పర్యటన**
**- భువనమ్మ పర్యటనను విజయవంతం చేసిన నేతలు కార్యకర్తలు**

## ప్రజా సేవలో తరించడమే ఎన్టీఆర్ ట్రస్ట్ ఆశయం



కుప్పం - సూర్య వాస్తవం:

ఎన్టీఆర్ ఆశయ సాధనలో ముందుంటామని ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ మేనేజింగ్ ట్రస్టీ నారా భువనేశ్వరి అన్నారు. ఆపన్నులను ఆదుకునేందుకు ట్రస్ట్ తలుపులు ఎప్పుడూ తెరిచే ఉంటాయని స్పష్టం చేశారు. కుప్పం నియోజకవర్గంలో నాలుగు రోజుల పర్యటనలో భాగంగా

- మిగతా 2లో..



## ప్రధాని నిర్ణయం దేశ ప్రజలకు ఊరట

**-- డిప్యూటీ సీఎం పవన్‌కల్యాణ్**

2లో

# రాష్ట్రాల సన్నద్ధతపై సమీక్ష

(మొదటిపేజీ తరువాయి)

టీమ్ ఇండియా స్ఫూర్తితో ఈ కృషిలో సమన్వయం సాధించడమే ఈ వీడియో సమావేశం లక్ష్యమని అధికార వర్గాలు పేర్కొన్నాయి. పశ్చిమాసియాలో పరిస్థితులను, అలాగే భారత ప్రభుత్వం అనుసరిస్తున్న విధానాలను ముఖ్యమంత్రులకు ఈ సమావేశంలో ప్రధాని వివరించారని తెలుస్తోంది. పశ్చిమాసియాలో యుద్ధం మొదలైన తర్వాత ప్రధాని ఇలాంటి సమావేశాన్ని ఏర్పాటు చేయడం ఇదే ప్రథమం. ఆంధ్రప్రదేశ్, తెలంగాణా, యుపి, పంజాబ్, గుజరాత్, జమ్మూ కాశ్మీర్, హిమాచల్ ప్రదేశ్, అరుణాచల్ ప్రదేశ్ ముఖ్యమంత్రులు పాల్గొన్నారు. ఎన్నికల ప్రవర్తనా నియమావళి (ఎంసిసి) అమల్లో వున్నందున ఎన్నికలు జరిగే రాష్ట్రాల సిఎంలు పాల్గొనలేదు. రక్షణ మంత్రి రాజ్‌నాథ్ సింగ్, హోం మంత్రి అమిత్‌షాలు కూడా పాల్గొన్నారు. కాగా ఎన్నికలు జరిగే ఈ రాష్ట్రాలు, కేంద్ర పాలిత ప్రాంత చీఫ్ సెక్రటరీలతో విడిగా కేబినెట్ సెక్రటరీ సమావేశం జరపనున్నారు. మార్చి 25న కేంద్ర ప్రభుత్వం అఖిలపక్షం నిర్వహించి పశ్చిమాసియాలో తలెత్తిన పరిస్థితులను వివరించింది. ఆ సమావేశానికి ప్రధాని గైర్హాజరైన విషయం పాఠకులకు తెలిసిందే. ఇంధన సంక్షోభం తలెత్తిన నేపథ్యంలో ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలను, సవివరమైన ప్రణాళికలను ఆ సమావేశంలో వివరించారు. ఈ ఇంధన సంక్షోభం సుదీర్ఘ కాలం కొనసాగే అవకాశం వుందంటూ ఈ నెల 23న లోక్‌సభలో మాట్లాడుతూ ప్రధాని పేర్కొన్నారు. కోవిడ్ సమయంలో అందరం కలిసి ఎలా ఎదుర్కొన్నామో ఇప్పుడు కూడా దేశం అందుకు సన్నద్ధంగా వుండాలని కోరారు.

# ఆర్థిక బిల్లు రాజ్యసభలో ఆమోదం

(మొదటిపేజీ తరువాయి)

ప్రభుత్వం ఏమీ కేటాయించలేదని ప్రతిపక్షాలు విమర్శించాయి. ఏప్రిల్ 29న ఎన్నికలు జరిగిన వెంటనే ఇంధన ధరలు గణనీయంగా పెరగడం ఖాయమని కూడా ప్రతిపక్షాలు పేర్కొన్నాయి.

**లోక్ సభలో 'జన్ విశ్వాస్ సవరణ బిల్లు'**

చిన్న నేరాలకు శిక్షను తగ్గించే నిబంధనలున్న 'జన్ విశ్వాస్ సవరణ బిల్లు'ను లోక్‌సభలో ప్రవేశపెట్టారు. వాణిజ్య, పారిశ్రామిక రంగాలలో చట్టాల చిన్నపాటి ఉల్లంఘనలను ఈ బిల్లు నేరరహితం చేస్తుందని మంత్రి జితిన్ ప్రసాద్ పేర్కొన్నారు. అయితే, ఇది రాజ్యాంగ మౌలిక స్వరూపాన్ని దెబ్బతీస్తుందని ప్రతిపక్షాలు విమర్శించాయి. ప్రధానమంత్రి, ముఖ్యమంత్రులను పదవి నుంచి తొలగించే బిల్లులను పరిశీలిస్తున్న పార్లమెంటరీ కమిటీ, వరుసగా 30 రోజులకు పైగా అరెస్టులు, నిర్బంధాలు జరిగిన పక్షంలో తన నివేదికను సమర్పించడానికి మరింత సమయం కోరింది. వర్షాకాల సమావేశాల చివరి వారం మొదటి రోజు వరకు లోక్‌సభ ఈ కమిటీ పదవీకాలాన్ని పొడిగించింది.

## మొక్కజొన్న ధరలో లోటు

# రైతులకు చెల్లిస్తాం

(మొదటిపేజీ తరువాయి)

సాగు చేయగా, సుమారు 37.61 లక్షల మెట్రిక్ టన్నుల ఉత్పత్తి అంచనా వేసినట్లు వెల్లడించారు. నంద్యాల, పల్నాడు, బాపట్ల, గుంటూరు, విజయనగరం జిల్లాలు ప్రధాన ఉత్పత్తి కేంద్రాలుగా ఉన్నాయన్నారు. రబీ సీజన్‌లో మొక్కజొన్న దిగుబడులు అధికంగా ఉండటం వల్ల మార్కెట్‌లో సరఫరా పెరిగిందని, దీంతో మార్కెట్‌లో ధరలు కనీస మద్దతు ధర కంటే తక్కువగా కొనసాగుతున్నాయని తెలిపారు. రాబోయే రోజుల్లో ధరలు మరింత పడిపోవచ్చని అంచనా ఉందన్నారు. రైతులు తక్కువ ధరలకు మొక్కజొన్న పంటను విక్రయించకుండా ధరలను స్థిరీకరించడం అవసరమని అభిప్రాయపడ్డారు. ఈ నేపథ్యంలో కేంద్రం నుంచి త్వరితగతిన అనుమతి లభిస్తే రైతులకు పెద్ద ఊరట లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

# పకడ్బందీగా పెట్రో ఉత్పత్తుల సరఫరా

(మొదటిపేజీ తరువాయి)

విక్రయాల బ్లాక్ మార్కెట్ నిరోధానికి కమిటీలు ఏర్పాటు చేసి నోడల్ అధికారులను నియమించినట్టు తెలిపారు. ప్రాధాన్య క్రమంలో ఆస్పత్రులు, పాఠశాలలు, అనాథాశ్రమాలు, వృద్ధాశ్రమాలకు కమర్షియల్ గ్యాస్ సిలిండర్లను సరఫరా చేస్తున్నట్టు వివరించారు. స్టాక్, రోజువారి వినియోగంపై అధికారులు ఎప్పటికప్పుడు పర్యవేక్షణ చేస్తున్నారని సీఎం పేర్కొన్నారు.

తెలంగాణలో సాధారణ రోజుల్లో రోజుకు 36,189 కిలో లీటర్ల పెట్రోల్, డీజిల్ వినియోగం జరుగుతుందనీ, ప్రస్తుతం 1,88,210 కిలోలీటర్ల నిల్వలు ఉన్నట్లు సీఎం వివరించారు. పెట్రోల్, డీజిల్, గ్యాస్ కొరతపై సోషల్ మీడియాలో అపోహలు, భయాందోళనలు కలిగేలా పోస్టులు పెడుతున్న వారిపై చట్టపరమైన చర్యలు తీసుకుంటున్నట్టు సీఎం తెలిపారు. తెలంగాణలో శిలాజ ఇంధనాలపై (బొగ్గు, చమురు, గ్యాస్) ఆధారపడడం తగ్గించి ఎలక్ట్రిక్ వాహనాల (ఈవీ) వినియోగాన్ని ప్రోత్సహిస్తున్నామని తెలిపారు. ఈవీలపై వంద శాతం రోడ్డు పన్ను, రిజిస్ట్రేషన్ ఫీజు మినహాయించామన్నారు. ఈవీల తయారీ, బ్యాటరీ ఎకోసిస్టమ్‌ను పెద్ద ఎత్తున ప్రోత్సహిస్తున్నట్టు సీఎం మోడీ దృష్టికి తీసుకెళ్లారు. హైదరాబాద్ నగరంలో 1.20 లక్షకుపైగా ఉన్న పెట్రోల్, డీజిల్ ఆటోలను రిట్రోఫిట్టింగ్ ద్వారా ఈవీలుగా మార్చే ప్రక్రియ ప్రారంభిస్తున్నట్టు తెలిపారు. ఈ వీడియో కాన్ఫరెన్స్‌లో రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన కార్యదర్శి రామకృష్ణారావు, సీఎం ప్రిన్సిపల్ సెక్రటరీ వి.శేషాద్రి ఇతర అధికారులు పాల్గొన్నారు.

# ప్రధాని నిర్ణయం దేశ ప్రజలకు ఊరట

## - డిప్యూటీ సిఎం పవన్‌కల్యాణ్

**అమరావతి - సూర్య వాస్తవం:** ప్రధాని మోడీ పశ్చిమాసియా యుద్ధ ప్రభావం దేశ ప్రజలపై పడకుండా పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకం తగ్గించి ఇంధన భారం నుంచి ఊరట కల్పించడం దేశ ప్రజలకు ఊరటనిస్తుందని ఉప ముఖ్యమంత్రి పవన్‌కల్యాణ్ పేర్కొన్నారు. ప్రపంచం మొత్తం ఇంధన సంక్షోభంలో చిక్కుకున్న వేళ మోడీ ఆ ప్రభావం దేశంపై పడకుండా ఎప్పటికప్పుడు జాగ్రత్తలు తీసుకుంటున్నట్లు తెలిపారు. ప్రజలపై భారం పడకుండా తీసుకుంటున్న చర్యలు అభినందనీయని పేర్కొన్నారు. పెట్రోల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని రూ.10 తగ్గించడంతోపాటు డీజిల్‌పై ఉన్న సుంకాన్ని పూర్తిగా రద్దు చేసినందుకు సంతృప్తి వ్యక్తం చేశారు. ఈ నిర్ణయం దేశ ప్రజలతోపాటు చమురు సంస్థలకు కూడా ఊరటనిస్తుందన్నారు.

# పెరుగుతున్న ఉద్రిక్తతలు

(మొదటిపేజీ తరువాయి)

**ఐక్యరాజ్యసమితికి ఇరాన్ లేఖ**

అమెరికా, ఇజ్రాయెల్‌లపై ఇరాన్ సంచలన ఆరోపణలు చేసింది. ఆ రెండు దేశాలవి ప్రభుత్వ ప్రాయోజిత ఉగ్రవాదమని అభివర్ణించింది. ఈ మేరకు ఐక్యరాజ్యసమితికి ఇరాన్ ఓ లేఖ రాసింది. తమ దేశ సీనియర్ ఉన్నతాధికారులు, విదేశాంగ మంత్రి సయ్యద్ అబ్బాస్ అరాగ్చి, పార్లమెంటు స్పీకర్ మహ్మద్ బాగెర్ ఘాలిబాఫ్‌లను హత్య చేసేందుకు అమెరికా, ఇజ్రాయెల్ కుట్ర పన్నాయని ఆ లేఖలో పేర్కొంది. ఈ లేఖను ఐక్యరాజ్యసమితి (యూఎన్) సెక్రెటరీ జనరల్ ఆంటోనియో గుటెరస్, యూఎన్ భద్రతా మండలి అధ్యక్షుడికి యూఎన్‌లోని ఇరాన్ శాశ్వత ప్రతినిధి అమీర్ సయ్యిద్ ఇరావని గురువారం అందించారు. ఈ వివరాలతో ఇరాన్ అధికారిక న్యూస్ ఛానల్ ఒకటి వార్తా కథనాన్ని ప్రసారం చేసింది. అమెరికా, ఇజ్రాయిల్‌లు ఉద్దేశపూర్వకంగానే ఈ హత్యలకు పాల్పడుతున్నాయని వివరించింది.

ఈ విధంగా కుట్రలు చేయడం అంతర్జాతీయ మానవ హక్కుల చట్టాలకు విరుద్ధమని ఆందోళన వ్యక్తం చేసింది. ఒకవేళ ఇరాన్ హై ర్యాంకింగ్ అధికారులపై దాడులు జరిగితే, అది శాంతియుత అంతర్జాతీయ సంబంధాలను దెబ్బతీస్తుందని హెచ్చరించింది. అరబ్ దేశాల తీరుపై కూడా ఇరాన్ ఆందోళన వ్యక్తం చేసింది. ఇరాన్‌పై దాడుల కోసం అమెరికా సైన్యానికి సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ (యూఏఈ) సహకారాన్ని అందించడం విచారకరమని పేర్కొంది. ఈ అరబ్ దేశాలు అంతర్జాతీయ చట్టాలను కాలరాస్తున్నాయని వివరించింది. సౌదీ అరేబియా, ఖతార్, కువైట్, యునైటెడ్ అరబ్ ఎమిరేట్స్ దేశాలు అమెరికాకు సైనికపరమైన ఆశ్రయం ఇవ్వడాన్ని ఆపాలని సూచించింది.

**ఇరాన్‌పై యూఎస్ రహస్య ఆయుధం**

గల్ఫ్ సముద్ర మార్గాల్లో పహారా కోసం తొలిసారిగా మానవరహిత డ్రోన్ స్పీడ్‌బోట్లను మోహరించినట్టు పెంటగాన్ అధికారికంగా ధృవీకరించింది. ఇరాన్ కార్యకలాపాలను అడ్డుకోవడంతో పాటు సముద్ర జలాల్లో నిఘా వ్యవస్థను పటిష్టం చేయటమే లక్ష్యమని పేర్కొంది. అత్యంత వేగంగా ప్రయాణించే ఈ స్పీడ్‌బోట్‌లు శత్రువుల కదలికలను సులువుగా పసిగడతాయని అమెరికా రక్షణ శాఖ తెలిపింది. గతంలో ఉక్రెయిన్ కూడా ఈ తరహా బోట్లనే వాడి రష్యాపై దాడులు చేసింది. ఇప్పుడు అదే వ్యూహాన్ని అనుసరించి ఇరాన్‌ను దెబ్బతీసేందుకు అమెరికా ప్రణాళికలు రచిస్తుంది. అయితే డ్రోన్ బోట్లలో అనేక వైఫల్యాలు ఉన్నట్టు సమా చారం. వీటిని అమెరికా ఇప్పటివరకు పూర్తిస్థాయిలో అభివృద్ధి చేయలేదు. గతేడాది జరిగిన పరీక్షల్లో ఓ జీఏఆర్‌సీ బోట్ వేగంగా వెళ్లి మరో బోట్‌ను ఢకట్టింది. తాజాగా మిడిల్ ఈస్ట్‌లో జరిగిన మరో పరీక్షలో ఓ డ్రోన్ స్పీడ్‌బోట్ పనిచేయకుండా పోయింది. అనేక సాంకేతిక లోపాలు ఈ బోట్లలో ఉన్నాయని ప్రచారం జరుగుతుంది.

**పెరుగుతున్న మృతులు**

పశ్చిమాసియా ఘర్షణల్లో మృతుల సంఖ్య పెరుగుతోంది. అమెరికా-ఇజ్రాయెల్ దాడుల్లో ఇరాన్‌లో ఇప్పటి వరకు 1900 మందికి పైగా మృతి చెందినట్టు తెలుస్తోంది. లెబనాన్‌లో 1,100 మందికి పైగా మృతి చెందినట్టు సమాచారం. ఇరాన్ దాడుల్లో ఇజ్రాయెల్‌లో 18 మంది, లెబనాన్‌లో ముగ్గురు ఇజ్రాయెల్ సైనికులు మృతి చెందారు అలాగే అమెరికా బలగాలకు చెందిన 13 మందితో పాటు ఆక్రమిత వెస్ట్ బ్యాంక్‌లో నలుగురు, గల్ఫ్ అరబ్ రాష్ట్రాల్లో 20 మంది మృతి చెందినట్టు గణాంకాలు చెప్తున్నాయి.

**దాడులు మరింత తీవ్రం : ఇజ్రాయిల్**

ఇరాన్‌పై దాడులు మరింత తీవ్రతరం చేస్తామని ఇజ్రాయిల్ రక్షణ మంత్రి ఇజ్రాయిల్ కట్జ్ హెచ్చరించారు. తాము పదే పదే చెప్తున్నా, ఇరాన్ తన దాడులు కొనసాగిస్తున్నదనీ, దాన్ని ఉపేక్షించబోమని చెప్పారు. మరిన్ని ప్రాంతాలను లక్ష్యంగా చేసుకుంటామనీ, దీనికి ఇరాన్ భారీ మూల్యం చెల్లించకోవాల్సి ఉంటుందని హెచ్చరించారు.

**పాకిస్తాన్ జెండాతో అమెరికాకు ఆయిల్**

హార్ముజ్ జలసంధిలో తమ నిబంధనలు ఉల్లంఘించి ప్రవేశించిన ఓ ఆయిల్ ట్యాంకర్‌పై శుక్రవారం 'ఇరాన్ రివల్యూషనరీ గార్డ్స్ కార్ప్స్ (ఐఆర్‌జీసీ)' క్షిపణులతో దాడిచేసి ధ్వంసం చేసింది. ఈ ట్యాంకర్‌పై పాకిస్తాన్ జెండా ఉంది. ఆ పేరుతో చమురును అక్రమంగా అమెరికాకు తరలిస్తున్నారని, దానికి ప్రతీకారంగానే ఈ దాడి జరిగినట్టు ఐఆర్‌జీసీ కథనాలు తెలిపాయి. ట్యాంకర్‌కు మంటలు అంటుకుని పూర్తిగా ధ్వంసమైన దృశ్యాలు సోషల్ మీడియాలో వైరల్ అయ్యాయి. ఈ ఘటనలో సిబ్బంది ప్రాణనష్టంపై ఇంకా స్పష్టత రాలేదు.

**మరో పది రోజులు దాడులు నిలిపివేత : ట్రంప్**

ఇరాన్ దాడులకు భీతిల్లుతున్న అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్ మరోసారి మేకపోతు గాంభీర్యం ప్రదర్శించారు.

ఇరాన్ అభ్యర్థన మేరకు మరో పదిరోజులు దాడుల్ని నిలుపుదల చేస్తున్నామని ప్రకటించారు. ఈ మేరకు తన సోషల్ మీడియా 'ట్రూత్ సోషల్' వేదికగా "ఇరాన్ ఎనర్జీ ప్లాంట్లపై దాడులకు సంబంధించిన గడువును మరో 10 రోజుల పాటు పొడిగిస్తున్నాను. వాళ్లు వారంరోజులు గడువు కోరారు. నేనే పది రోజులు గడువిచ్చా. ఇరాన్ ప్రతినిధులతో జరుగుతున్న చర్చలు అత్యంత ఆశాజనకంగా ఉన్నాయి" అని రాసుకొచ్చారు. మరోవైపు యథాప్రకారం అమెరికా మీడియాపై ఆయన తన ఆగ్రహాన్ని వెళ్లగక్కారు. ఇరాన్‌తో చర్చలు విఫలమవుతున్నాయంటూ వస్తున్న వార్తలపై స్పందిస్తూ అవన్నీ 'ఫేక్ న్యూస్' అని కొట్టిపారేశారు. ఇరాన్‌తో చర్చలు సానుకూలంగా జరుగుతున్నాయని పేర్కొన్నారు. ఈ విషయంపై ట్రంప్ తన 'డిపార్ట్‌మెంట్ ఆఫ్ వార్'కు స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. ఏప్రిల్ 6 వరకు ఇరాన్ ఎనర్జీ గ్రిడ్‌లపై ఎటువంటి బాంబు దాడులు చేయకూడదని చెప్పారు.

ట్రంప్‌పై అమెరికన్ల అసంతృప్తి..ఆ దేశంలోపెరిగిన జీవన వ్యయం

అమెరికా అధ్యక్షుడు డోనాల్డ్ ట్రంప్‌పై ఆదేశంలో ప్రజావ్యతిరేకత తీవ్రమవుతున్నది. పశ్చిమాసియాలో యుద్ధ పరిస్థితుల నేపథ్యంలో అమెరికాలో నిత్యావసర వస్తువుల ధరలు భారీగా పెరిగాయి. ప్రజల జీవన వ్యయం పెరిగింది. ఈ మేరకు అమెరికాలోని పలు స్వచ్ఛంద సంస్థలు నిర్వహించిన సర్వేల్లో వెల్లడైంది. పరిస్థితులు ఇలాగే కొనసాగితే వచ్చే నవంబర్ ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీకి ఎదురుదెబ్బ తప్పదని ఆ సర్వేలు హెచ్చరిస్తున్నాయి. ఈ భయం ఇప్పుడు రిపబ్లికన్లను వెంటాడుతుంది.

**ఇజ్రాయిల్ సైన్యం కుప్పకూలే ప్రమాదం: ఐడీఎఫ్ చీఫ్ ఇయాల్ జమీర్**

"హమాస్, హిజ్బుల్లా, ఇరాన్ దళాలతో ఏకకాలంలో పోరాడుతున్న ఇజ్రాయెల్ సైన్యం, ప్రస్తుతం తీవ్రమైన 'మానవ వనరుల కొరత' ఎదుర్కొంటోంది. తక్షణ చర్యలు తీసుకోకపోతే పరిస్థితి దారుణంగా తయారవుతుంది. యుద్ధం ఇలాగే కొనసాగితే ఇజ్రాయెల్ సైన్యం కుప్పకూలే ప్రమాదం ఉంది." అని ఇజ్రాయెల్ రక్షణ దళాల (ఐడీఎఫ్) చీఫ్ ఆఫ్ స్టాఫ్, లెఫ్టినెంట్ జనరల్ అయాల్ జమీర్ హెచ్చరించారు. ఇటీవల జరిగిన భద్రతా క్యాబి నెట్ సమావేశంలో జమీర్ ఈ కీలక విషయాలపై మాట్లాడినట్టు సంబంధిత వర్గాలు తెలిపాయి. పశ్చిమాసియా యుద్ధ నేపథ్యంలో పెరుగుతున్న కార్యచరణ ఒత్తిళ్లను ఆయన వివరించారు. ఇదే క్రమంలో ఇజ్రాయెల్ ప్రభుత్వం ముందు 10 ప్రదిపాదనలు ఉంచారు. అందులో ప్రస్తుత పరిస్థితి తీవ్రతను ఆయన వివరించారు. పరిస్థితులు ఇలాగే కొనసాగితే సైన్యం తన రోజువారీ సాధారణ మిషన్లను కూడా పూర్తి చేయలేని రోజు ఎంతో దూరంలో లేదని ఘాటుగానే హెచ్చరించినట్టు తెలిసింది.

**చర్చలే పరిష్కారం : చైనా**

హార్ముజ్ జలసంధి పునరుద్ధరణకు చర్చలు దోహదం చేస్తాయని చైనా వెల్లడించింది. అయితే అవి అంత సులువు కాకున్నా, హార్ముజ్ మీదుగా సాధారణ నౌకాయానాన్ని పునరుద్ధరించేందుకు అనుకూలంగా ఉంటాయని ఆశాభావం వ్యక్తం చేసింది. ఈ మేరకు పాకిస్తాన్ విదేశాంగ మంత్రితో ఫోన్‌లో మాట్లాడుతూ చైనా విదేశాంగ మంత్రి యాంగ్ యీ ఈ వ్యాఖ్యలు చేశారు. మధ్యవర్తిగా వ్యవహరించేందుకు పాకిస్తాన్‌కు చైనా మద్దతు తెలిపింది.

## ప్రజా సేవలో తరించడమే

# ఎన్టీఆర్ ట్రస్ట్ ఆశయం

(మొదటిపేజీ తరువాయి)




పలు గ్రామాల్లో భువనేశ్వరి పర్యటించారు. అనేక కార్యక్రమాల్లో పాల్గొన్నారు. మహిళలతో సమావేశమయ్యారు. 4వ రోజు పర్యటనలో ముందుగా శ్రీరామ నవమిని పురస్కరించుకుని కుప్పంలో కోదండరామ స్వామి ఆలయాన్ని సందర్శించి ప్రత్యేక పూజలు చేశారు. అనంతరం కుప్పంలో ముఖ్యమంత్రి చంద్రబాబు బాల్య స్నేహితుడు చంద్రశేఖర్ ఇంటికి భువనేశ్వరి వెళ్లారు. కుటుంబ సభ్యులతో ఆప్యాయంగా మాట్లాడి వారి యోగక్షేమాలు తెలుసుకున్నారు. ఆ తర్వాత రోడ్డు ప్రమాదంలో మృతి చెందిన టీడీపీ కార్యకర్త బాల కుమార్ కుటుంబసభ్యులను పరామర్శించారు. టీడీపీ అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు.

**పేదలకు అండగా ట్రస్ట్ సేవలు**

ఎన్టీఆర్ స్ఫూర్తితో, సీఎం చంద్రబాబు సహకారంతో ట్రస్ట్ సేవలు కొనసాగిస్తున్నామని నారా భువనేశ్వరి అన్నారు. కుప్పం టీటీడీ కల్యాణ మండపంలో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ ఆధ్వర్యంలో నిర్వహించిన స్వయం ఉపాధికి చేయూత కార్యక్రమంలో భువనేశ్వరి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ట్రస్ట్ చేస్తున్న సేవా కార్యక్రమాలను వివరించారు. ఎన్టీఆర్ స్ఫూర్తితో ఎన్టీఆర్ మెమోరియల్ ట్రస్ట్ స్థాపించి 29 సంవత్సరాలు పూర్త యింది. చంద్రబాబు రాజకీయాల్లో బిజీగా ఉండటం వల్ల ట్రస్ట్ బాధ్యతలు నాకు అప్పగించారు. చంద్రబాబు అందించిన స్ఫూర్తితో ట్రస్ట్ ద్వారా సేవా కార్యక్రమాలను ముందుకు తీసుకెళ్తున్నాం. తలసేమియా వ్యాధిగ్రస్తులకు మా వంతు సాయం అందిస్తున్నాం. దాతలు కూడా మాకు సాయంగా నిలుస్తున్నారు. త్వరలోనే విజయవాడ , అనంతపురంలో కూడా తలసేమియా సెంటర్లు ప్రారంభిస్తాం. ట్రస్ట్ ఆధ్వర్యంలో హైదరాబాద్, విశాఖపట్నం, రాజమండ్రి, తిరుపతిలో నాలుగు బ్లడ్ బ్యాంక్స్ నిర్వహిస్తున్నాం. త్వరలో విజయవాడలో ప్రారంభిస్తాం. తలసేమియా బాధితుల కోసం మే 10న హైదరాబాద్ లో నిర్వహించే రన్ లో అందరూ పాల్గొని వారికి ధైర్యం చెప్పాలని భువనేశ్వరి కోరారు.

**ట్రస్ట్ ద్వారా విద్య, వైద్యం, ఉపాధి కల్పన**

ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో హెల్త్ క్యాంపుల నిర్వహిస్తున్నాం. వీటి ద్వారా 23 లక్షలమందికి సేవలు అందిం చాం. ఇందుకోసం రూ.23 కోట్లు ఖర్చు చేశాం. ఎన్టీఆర్ సంజీవని ద్వారా పేద ప్రజలకు ఆరోగ్య భద్రత కల్పిస్తున్నాం. ఉచితంగా మందులు పంపిణీ చేస్తున్నాం. ఏజెన్సీ ఏరియాల్లో హెల్త్ క్యాంప్స్ నిర్వహిస్తున్నాం. హైదరాబాద్ గండిపేటలో ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్, డిగ్రీ కాలేజ్ ఉన్నాయి. ఎన్టీఆర్ మెమోరియల్ స్కూల్ ద్వారా గ్రామీణ నేపథ్యం నుంచి వచ్చే పిల్లలకు గణితం, ఆంగ్లంలో పట్టు సాధించేలా శిక్షణ అందిస్తున్నాం. ఎన్టీఆర్ ట్రస్ట్ ద్వారా ఇన్ని సేవా కార్యక్రమాలు నిర్వహిస్తున్నామంటే అందుకు దాతలు, మా సిబ్బంది సహకారమే కారణం. ఒకప్పుడు ఇంటికే పరిమితమైన నాకు చంద్రబాబు హెరిటేజ్ బాధ్యతలు అప్పగించినప్పుడు ఏం చేయాలో, ఎలా మాట్లాడాలో కూడా తెలిసేది కాదు. ఏదైనా చేయగలను అని ధైర్యంగా అడుగు ముందుకు వేస్తే విజయం సాధించగలం. మహిళల ఆర్థిక స్వావలంబన కోసం కుప్పంలో స్త్రీ శక్తి స్కిల్ డెవలప్ మెంట్ సెంటర్ ఏర్పాటు చేశాం. ఇక్కడ శిక్షణ తీసుకున్న మహిళలు ఆర్థికంగా వారి కాళ్లపై వారు నిలబడుతున్నారు.





ఎన్టీఆర్ ట్రస్ట్ ఆధ్వర్యంలో శిక్షణ పొందిన మహిళల ఉత్పత్తుల మార్కెటింగ్ కోసం హైదరాబాద్ లో స్త్రీ శక్తి హస్తకళ స్టోర్ ఏర్పాటు చేశామని భువనేశ్వరి తెలిపారు. అనంతరం 40 మంది మహిళలకు కుట్టు మిషన్లు, 30 మందికి తోపుడు బండ్లు , పలువురికి వినికిడి మిషన్లను భువనేశ్వరి అందజేశారు.అనంతరం బెంగళూరు కు తిరుగు ప్రయాణమైన నారా భువనేశ్వరికి ప్రభుత్వ విప్ ఎమ్మెల్సీ డాక్టర్ కంచర్ల శ్రీకాంత్ ఏపీఎస్ఆర్టీసీ వైస్ చైర్మన్ పిఎస్ మునిరత్నం, పిఎంకె ఉడా అధ్యక్షులు డాక్టర్ బి.ఆర్ సురేష్ బాబు, మాజీ ఎమ్మెల్సీ గౌని వారి శ్రీనివాసులు, కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్, కుప్పం మున్సిపల్ చైర్మన్ సెల్వరాజ్, కుప్పం పట్టణ మున్సిపల్ పార్టీ అధ్యక్షుడు కాణిపాకం వెంకటేష్, మున్సిపల్ కౌన్సిలర్లు జాకీర్ అహ్మద్, దామోదర్, (దాము), సీనియర్ నేతలు పి గోపీనాథ్, రాజ్కుమార్, డాక్టర్ వెంకటేష్, ఐటిడిపి నేతలు రాజేంద్ర, క్లస్టర్ ఇంచార్జ్ లు కణ్ణన్, కుప్పం ఏరియా ఆసుపత్రి వైస్ చైర్మన్ భాగ్యలక్ష్మి, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు చంద్రకళ,కడ అడ్వైజరీ కమిటీ సభ్యురాలు వి.సుగుణమ్మ, నాలుగు మండలాల పార్టీ మహిళా అధ్యక్షులు,ఆ పార్టీ వివిధ నామినేటెడ్ విభాగాల డైరెక్టర్ లు, నాలుగు మండలాల తెలుగుదేశం పార్టీ అధ్యక్షులు, కార్యకర్తలు ఘనంగా వీడ్కోలు పలికిన వారిలో ఉన్నారు.

# సంపాదకీయం



## మహిళా లీడర్లు కావలెను




తెలుగు రాష్ట్రాల రాజకీయాల్లో గతంలో ఎన్నడూ లేని విధంగా ఒక భారీ మార్పు రాబోతోంది. నియోజకవర్గాల పునర్విభజనతో పెరగనున్న సీట్లు , మహిళా రిజర్వేషన్ బిల్లు అమలులోకి రానుండటంతో, ఆంధ్రప్రదేశ్, తెలంగాణ రాజకీయ యవనికపై మహిళా నేతల హవా మొదలుకానుంది. ఇప్పటి వరకు పురుషాధిక్య రాజకీయాల్లో అవకాశాల కోసం ఎదురుచూసిన ఎంతో మంది చైతన్యవంతులైన మహిళలకు ఇది నిజంగానే గోల్డెన్ టైమ్ అని చెప్పవచ్చు. ప్రతి ముగ్గురు ఎమ్మెల్యేలలో ఒకరు కచ్చితంగా మహిళా నేతే ఉండబోతుండటంతో, ఇరు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలు ఇప్పటి నుంచే మహిళా కేడర్‌ను సిద్ధం చేసే పనిలో పడ్డాయి. 2029 అసెంబ్లీ ఎన్నికలు.. నియోజకవర్గాల పునర్విభజన తర్వాతే జరగడం ఖాయంగా కనిపిస్తోంది.

దీంతోపాటు 33 శాతం మహిళా రిజర్వేషన్లు కూడా అమలు కానున్నట్టు తెలుస్తోంది. ఈ నేపథ్యంలో రాష్ట్ర రాజకీయాల్లో ఆసక్తికర చర్చ మొదలైంది. ముఖ్యంగా అసెంబ్లీ సమావేశాలు జరుగుతున్న సమయంలో ఏ ఇద్దరు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు కలిసినా పెరగబోయే స్థానాలు, మహిళా రిజర్వేషన్? కింద దక్కబోయే సీట్లపైనే చర్చించుకుంటున్నారు. నియోజకవర్గాల పునర్విభజనతో రాష్ట్రంలో ఇప్పుడున్న 119 అసెంబ్లీ సీట్లు 179కి పెరగనున్నాయి. 33 శాతం విమెన్ ?రిజర్వేషన్ అమలైతే తెలంగాణలో వారికి ఏకంగా 59 సీట్లు దక్కనున్నాయి.

మహిళలకు ఇంత పెద్ద సంఖ్యలో అసెంబ్లీ సీట్లు రిజర్వుకానుండడంతో పలువురు ప్రజాప్రతినిధులు, నేతలు తమ కుటుంబాల్లోని మహిళలకు రెండో సీటుపై ఇప్పటి నుంచే కన్నేస్తున్నారు. ఆ దిశగా భార్య, కూతు రు, కోడలుతో రాజకీయ పరిచయ కార్యక్రమం చేయిస్తున్నారు. పండుగలు, పబ్బాలు, ఇతర శుభ కార్యాలను పురస్కరించుకొని ఆయా నియోజకవర్గాల్లో ప్రజలకు శుభాకాంక్షలు చెపుతూ ఫ్లెక్సీలు, హోర్డింగ్?లు, కటౌట్లు ఏర్పాటు చేస్తున్నారు. దీంతో వీటిపై జనాల్లో ఆసక్తికర చర్చ సాగుతోంది. ప్రస్తుత అంచనాల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో అసెంబ్లీ సీట్లు 50 శాతం పెరిగితే అందులో సుమారు 80 స్థానాలు మహిళలకే కేటాయించాల్సి ఉంటుంది. అలాగే తెలంగాణలో 60 స్థానాలు మహిళలకు రిజర్వ్ అవుతాయి. అంటే రెండు రాష్ట్రాల్లో కలిపి సుమారు 140 మందికి పైగా మహిళా ఎమ్మెల్యేలు చట్టసభల్లో అడుగుపెట్టబోతున్నారు. గతంలో కేవలం 10 నుంచి 15 శాతం లోపే ఉన్న మహిళా ప్రాతినిధ్యం, ఇప్పుడు ఏకంగా 33 శాతానికి పెరగడం రాజకీయ ముఖచిత్రాన్ని పూర్తిగా మార్చేయనుంది. గతంలో స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు రిజర్వేషన్లు ఉన్నప్పటికీ, చాలా చోట్ల భర్తలు లేదా కుటుంబ సభ్యులు ప్రాక్సీ లుగా పాలన సాగించేవారు. కానీ, అసెంబ్లీ స్థాయికి వచ్చేసరికి పరిస్థితి భిన్నంగా ఉండబోతోంది. ప్రస్తుతం సోషల్ మీడియా వాడకం, పెరిగిన విద్యావంతుల సంఖ్య, మహిళల్లో వచ్చిన రాజకీయ చైతన్యంతో సొంతంగా ఎదిగే నేతలకే ప్రాధాన్యత పెరగనుంది. పార్టీలు కూడా కేవలం డమ్మీ అభ్యర్థులను కాకుండా, ప్రజల్లో పట్టున్న, సొంతంగా గెలవగల సామర్థ్యం ఉన్న మహిళా నేతలకే టికెట్లు ఇచ్చే అవకాశం ఉంది.

ఇప్పటికే తెలుగు రాష్ట్రాల్లోని ప్రధాన పార్టీలైన టీడపీ, వైఎస్సార్‌సీపీ, జనసేన, బీఆర్ఎస్, కాంగ్రెస్, బీజేపీలలో ద్వితీయ శ్రేణి మహిళా నాయకత్వం బలంగా ఉంది. నియోజకవర్గాల్లో పార్టీ కార్యకలాపాలు నిర్వహించడం, ప్రజా సమస్యలపై గళం విప్పడం వంటి పనుల్లో మహిళలు చురుగ్గా పాల్గొంటున్నారు. రాబోయే ఎన్నికల్లో రిజర్వేషన్లు ఖచ్చితం కావడంతో, ఇప్పటి వరకు తెర వెనుక ఉండి పనిచేసిన మహిళా నేతలు ఇప్పుడు నేరుగా ప్రజల ముందుకు వచ్చి తమ నాయకత్వ లక్షణాలను నిరూపించుకోవడానికి సిద్ధమవుతున్నారు. ఇది రాజకీయాల్లో ఒక రకమైన వడపోత కు దారితీసి, అసలైన సమర్థులైన మహిళా నేతలను బయటకు తీస్తుంది. మహిళా రిజర్వేషన్ల వల్ల కేవలం లింగపరమైన ప్రాతినిధ్యమే కాకుండా, సామాజిక సమీకరణాలు కూడా మారుతాయి. రిజర్వ్‌డ్ నియోజకవర్గాల్లో మహిళా నేతల ఎంపిక కోసం పార్టీలు కొత్త వ్యూహాలను రచించాల్సి ఉంటుంది. మహిళా ఓటర్లు అత్యధికంగా ఉన్న తెలుగు రాష్ట్రాల్లో, ఒక మహిళా నేత ఎన్నికల బరిలో ఉంటే మహిళా ఓటింగ్ శాతం పెరగడమే కాకుండా, విద్య, ఆరోగ్యం, తాగునీరు వంటి మౌలిక సమస్యలపై చర్చ ఎక్కువగా జరుగుతుంది. ఇది రాజకీయాల్లో క్వాలిటీ ని పెంచుతుందనడంలో సందేహం లేదు. తెలుగు రాష్ట్రాల్లో మహిళా నేతలకు రాబోయే ఐదేళ్లు అత్యంత కీలకం. అవకాశాల కోసం ఎదురుచూసే దశ నుంచి, అవకాశాలను శాసించే దశకు వారు చేరుకోబోతున్నారు. పార్టీలు కూడా తమ గెలుపు గుర్రాలను వెతుక్కునే క్రమంలో మహిళా అనుబంధ విభాగాలను బలోపేతం చేస్తున్నాయి. చట్టసభల్లో మహిళల భాగస్వామ్యం పెరగడం వల్ల పాలనలో మానవత్వం, పారదర్శకత పెరుగుతాయని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ మార్పు కేవలం రాజకీయాలకే పరిమితం కాకుండా, సమాజంలోని అన్ని రంగాల్లో మహిళల సాధికారతకు బాటలు వేయనుంది.



అనంతపురం పట్టణంలో అప్పుడే ఎండలు మండిపోతున్నాయి. జనాలు మధ్యాహ్నం పూట బయటకు రావాలంటేనే జంకుతున్నారు. రోడ్డ మీద పదినిమిషాలు నిలబడలేని పరిస్థితి కనబడుతుంది. అలాంటిది ఎండలో ఉదయం నుంచి సాయంత్రం వరకు డ్యూటీ చేస్తున్న ట్రాఫిక్ పోలీసుల పరిస్థితి మరీ ఘోరంగా ఉంది. మండుతున్న ఎండలో ట్రాఫిక్ పోలీసులు ఎలా డ్యూటి చేస్తున్నారు. తీవ్రమైన ఎండల్లో ట్రాఫిక్ పోలీసులు ఉదయం నుంచి రాత్రి వరకు రోడ్లపై విధులు నిర్వహిస్తూ నిర్జలీకరణం, అలసటతో ఎండపోటు బారిన పడే అవకాశం ఎక్కువగా ఉంది....ఎండలో ట్రాఫిక్ జామ్ అయిన ప్పుడు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. పది నిమిషాలు ఎండలో ఉంటేనే మనం నీడను వెతుక్కుంటాం. ట్రాఫిక్ పోలీసులు ఉదయం నుంచి సాయంత్రం వరకు ఎండకు ఎండుతూ డ్యూటీలు చేస్తున్నారు. వాళ్ళు ఎండ నుంచి ఉపశమనం పొందడానికి పై అధికారులు సమ్మర్ కిట్‌లాంటి సదుపాయాలు కల్పించాలని వారి కుటుంబ సభ్యులకు కోరుకుంటున్నారు....

# సెల్యూట్ ట్రాఫిక్ పోలీసన్న

- ఎర్రటి ఎండలో.... ట్రాఫిక్ పోలీసుల కష్టాలు
- సమ్మర్ కిట్ లేకుండా ఎండకి ఎండుతూ విధులు...?
- ఎండ పోటుతో డీహైడ్రేషన్ బారిన పడకుండా చర్యలు తీసుకోవాలి
- అనారోగ్యం బారిన పడుతున్నారని బెంబేలెత్తుతున్న కుటుంబ సభ్యులు



**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :**

ట్రాఫిక్ పోలీసు విధులు అనుకున్నంత సులువు కాదన్నది జగమెరిగిన సత్యం. ఒక్క క్షణం తీరిక గాని సమయం కానీ ఉండదు, నిత్యం విధుల్లోనే ఉంటారు, నిర్లక్ష్యం అని అనలేం, ఎందుకంటే వాళ్ల విధి నిర్వహణ ఎప్పుడు దుమ్ము దులి, గాలి, వాన, ఎండ కి చేస్తూనే ఉండాలి, నిర్లక్ష్యం వహించిన వారి ఆరోగ్యం ప్రమాద బారిన పడే అవకాశాలు ఉన్నాయి గతంలో చాలా మంది పడ్డారు కూడా.... ఇన్ని సవాళ్లు ఉన్నా కూడా డ్యూటీ కి వారు వెనకడుగు వెయ్యరు..... ట్రాఫిక్ పోలీసుల పాలిట ఈ వేసవి డేంజర్గా మార నుంది. వారిపై సమ్మర్ ఎఫెక్ట్ భారీగా పడనుంది. నిత్యం విధుల్లో భాగంగా ట్రాఫిక్, దుమ్ము, ధూళితో యుద్ధం చేసేవారు ఇప్పటినుంచి మండుటెండలో చెమట, ఉక్క పోతతో కూడా యుద్ధం చేయాల్సి ఉంటుంది. దీంతో చాలామంది ట్రాఫిక్ పోలీసులు డీహైడ్రేషన్ బారిన పడి అనారోగ్యానికి గురవుతారు . ఈ వేసవిలో ఈ కష్టాలను అధిగమించేందుకు ట్రాఫిక్ పోలీసులకు సమ్మర్ కిట్ వంటివి అందజేయాల్సి ఉంది. దీని పై పోలీస్ ఉన్నతధికారులు దృష్టి పెట్టాలని7 ట్రాఫిక్ సిబ్బంది కుటుంబ సభ్యులు కోరుకుంటున్నారు. లా అండ్ ఆర్డర్ పోలీసులకు, ట్రాఫిక్ పోలీసుల తో పోలిస్తే చాలా సమయం నిలబడి ఉండటం, దుమ్ము, పొగ కారణంగా మోకాళ్ల నొప్పులు, వెన్నునొప్పితో పాటు తీవ్ర అనారోగ్యానికి గురవుతున్నారు. ఒక ఉద్యోగి ఉదయం 7:45 కి విధులకు హాజరుకావాలి. ఉదయం షిఫ్ట్ వచ్చిన సిబ్బంది మధ్యాహ్నం 2 గంటల వరకు విధుల్లో కొనసాగుతారు. మధ్యాహ్నం 2 గంటలకు వచ్చిన వారు రాత్రి 10 గంటల వరకు కొనసాగుతారు. ఈ సమయం కారణంగా సకాలంలో భోజనం చేయకపోవడం వల్ల సిబ్బంది ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. సిగ్నల్స్ దగ్గరలో వాహన దారులు ఒక నిమిషం ఆగడానికే నానా ఇబ్బందులు పడుతున్నారు. అలాంటి ట్రాఫిక్ పోలీసులు గంటల కొద్దీ మండుటెండల్లో నిలబడి ట్రాఫిక్‌ని కంట్రోల్ చేస్తున్నారు. అలాంటి పరిస్థితిలో ట్రాఫిక్ ను కంట్రోల్ చేస్తున్న ట్రాఫిక్ పోలీసులకు హ్యాట్సాఫ్ చెప్పాల్సిందే అంటున్నారు నగర వాసులు.....

# పెట్రో కష్టాలు తీరినట్టే

**న్యూఢిల్లీ - సూర్య వాస్తవం :**

ఇరాన్, అమెరికా యుద్ధం కారణంగా ఇరాన్ హర్మ్యూజ్ జలసంధిని మూసివేసింది. వాటర్‌మైన్స్ అమర్చింది. దీంతో 25 రోజులుగా హర్మ్యూజ్ వద్ద వందల చమురు, సరుకు రవాణా నౌకలు నిలిచిపోయాయి. అయితే భారత ప్రభుత్వం ఇరాన్‌తో జరిపిన చర్చలతో భారత నౌకలు హర్మ్యూజ్ దాటుతున్నాయి. ఇప్పటికే 8 నౌకలు భారత్‌కు చేరుకున్నాయి. తాజాగా ఇరాన్ అమెరికా, ఇజ్రాయెల్ నౌకలు మినహా అన్నింటికీ అనుమతి ఇచ్చింది. ఇరాన్ విదేశాంగ మంత్రి అబ్బాస్ అరాగ్చీ, భారత్‌తో పాటు చైనా, రష్యా, ఇరాక్, పాకిస్తాన్‌లా ఉన్న మిత్ర దేశాల నౌకలు హర్మ్యూజ్ జలాంతర్గతాన్ని దాటుతూ ప్రయాణించేందుకు అనుమతి ఇస్తామని ప్రకటించారు. ముంబైలోని ఇరాన్ కాన్సులేట్ ఈమేరకు 'ఎక్స్'లో పోస్టు చేశారు. హర్మ్యూజ్‌లో చిక్కు కున్న భారత నౌకలు, ముఖ్యంగా ఐదు గ్యాస్ ట్యాంకర్లు రెండు మూడు రోజుల్ల భారత్‌కు చేరుకోనున్నాయి. ఇది భారత వాణిజ్యానికి ఊతం ఇవ్వనున్నాయి. గ్యాస్ కొరత తీరనుంది. ఇరాన్‌తో యుద్ధం చేస్తున్న దేశాల నౌకలకు మాత్రం అనుమతి ఇవ్వమని స్పష్టం చేసింది. హర్మ్యూజ్ డ్రాక్‌లో ప్రయాణించే నౌకలపై ఫీజు వసూలు చేసే చట్టాన్ని ఇరాన్ పార్లమెంట్ ఆమోదించే దశలో ఉంది. బదులుగా భద్రతా సంరక్షణ అందిస్తామని అధికారిక ఫార్స్ న్యూస్ ఏజెన్సీ తెలిపింది. బ్లూమ్బెర్గ్ ఈ అంశాన్ని హైలైట్ చేసింది. ఫీజు వసూలు చేస్తే ఆయిల్, గ్యాస్ ధరలు పెరిగే అవకాశం ఉంది. ఇరాన్ ఆర్థిక అవసరాల కోసం ఫీజు ఆలోచన చేస్తోంది. అయితే అంతర్జాతీయ చట్టాలు మాత్రం దీనిని అంగీకరించవు. అనుమతి మధ్యప్రాచ్య ఉద్రిక్తతల మధ్య శాంతి సంకేతంగా కనిపిస్తుంది. భారత్‌లాంటి దేశాలకు ప్రయోజనం చేకూరినా, టోల్ విధానం గ్లోబల్ షిప్పింగ్ ఖర్చులను పెంచే అవకాశం ఉంది. ఇది ఇరాన్ ఆర్థిక బలోపేతానికి దోహదపడుతుంది.

**తగ్గిన పెట్రోలు, డీజిల్ ధరలు**

ప్రపంచవ్యాప్తంగా నెలకొన్న ఇంధన సంక్షోభం, పశ్చిమాసియా ఉద్రిక్తతల నేపథ్యంలో భారత ప్రభుత్వం వాహన దారులకు భారీ ఊరటనిచ్చే వార్తను ప్రకటించింది. పెట్రోల్, డీజిల్‌పై ఎక్సైజ్ సుంకాన్ని భారీగా తగ్గిస్తూ ప్రభుత్వం నిర్ణయం తీసుకుంది. తాజా నిర్ణయం ప్రకారం, పెట్రోల్‌పై లీటరుకు రూ. 10 ఎక్సైజ్ సుంకాన్ని తగ్గించారు. దీనితో పెట్రోల్‌పై గతంలో ఉన్న రూ. 13 సుంకం ఇప్పుడు రూ. 3కి చేరింది. అలాగే, డీజిల్‌పై గతంలో ఉన్న రూ. 10 ఎక్సైజ్ సుంకాన్ని పూర్తిగా రద్దు చేస్తూ, దానిని సున్నాకు తగ్గించారు. ఈ నిర్ణయం తక్షణమే అమల్లోకి వస్తుందని సమాచారం.




అమెరికా-ఇజ్రాయెల్, ఇరాన్ మధ్య జరుగుతున్న యుద్ధం కారణంగా ప్రపంచవ్యాప్తంగా ఇంధన సరఫరాలో అంతరాయం ఏర్పడింది. ముఖ్యంగా ప్రపంచ ముడిచమురు సరఫరాలో ఐదో వంతు వాటా కలిగిన స్ట్రెయిట్ ఆఫ్ హోర్ముజ్‌పై ఇరాన్ ఆంక్షలు విధించడంతో ముడిచమురు ధరలు ఆకాశాన్ని తాకాయి. ఈ యుద్ధానికి ముందు భారత్ తన చమురు అవసరాల్లో 12 నుంచి 15 శాతం వరకు ఈ మార్గం ద్వారానే దిగుమతి చేసుకునేది. అంతర్జాతీయంగా ముడిచమురు ధరలు పెరుగుతున్నప్పటికీ, దేశీయంగా సామాన్యులపై ఆ భారం పడకుండా ఉండాలని ప్రభుత్వం ఈ నిర్ణయం తీసుకుంది. ఎక్సైజ్ సుంకం తగ్గింపు వల్ల నిత్యావసర వస్తువుల రవాణా ఖర్చులు తగ్గి, ద్రవ్యోల్బణం నియంత్రణలోకి వచ్చే అవకాశం ఉందని ఆర్థిక నిపుణులు భావిస్తున్నారు.

# అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ అమలు చేయాలి..

## - ఐ.ఏ.ఎల్ కర్నూలు జిల్లా అధ్యక్షులు ఎన్. కృష్ణయ్య డిమాండ్



**పత్తికొండ - సూర్య వాస్తవం :** తెలంగాణ రాష్ట్ర ప్రభుత్వం తరహాలో ఆంధ్రప్రదేశ్‌లోనూ 'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్'ను సత్వరమే అమలు చేయాలని ఐ .ఏ .ఎల్ జిల్లా అధ్యక్షులు ఎన్. కృష్ణయ్య డిమాండ్ చేశారు. ఈ మేరకు శుక్రవారం ఆయన ఒక ప్రకటన విడుదల చేశారు. తెలంగాణ ప్రభుత్వం న్యాయవాదుల భద్రతను దృష్టిలో ఉంచుకుని 'అడ్వకేట్ ప్రొటెక్షన్ బిల్లు'కు ఆమోదం తెలపడం పట్ల భారత న్యాయవాదుల సంఘం (ఐ.ఏ.ఎల్) తరఫున ఆయన స్వాగతించారు. ఇదే సందర్భంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం కూడా రాష్ట్రవ్యాప్తంగా వేలాది మంది న్యాయవాదుల భద్రతను పరిరక్షించే దిశగా తక్షణమే సమగ్ర రక్షణ చట్టాన్ని అమలు చేయాలని కోరారు.సమాజంలో సామాన్య ప్రజలకు న్యాయం అందించేందుకు నిరంతరం కృషి చేస్తున్న న్యాయవాదులపై ఇటీవలి కాలంలో దాడులు పెరుగుతున్న పరిస్థితి తీవ్ర ఆందోళనకు గురిచేస్తోందని పేర్కొన్నారు. గతంలో చోటుచేసుకున్న గట్టు వామనరావు దంపతుల హత్య వంటి దారుణ ఘటనలు న్యాయవాద వృత్తి భద్రతపై తీవ్రమైన సందేహాలను రేకెత్తిస్తున్నాయని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలాంటి పరిస్థితుల్లో న్యాయవాదులకు చట్టపరమైన రక్షణ కల్పించడం ప్రభుత్వపు ప్రధాన బాధ్యతగా మారిందని స్పష్టం చేశారు. తెలంగాణ ప్రభుత్వం ఈ నెల 23న తీసుకున్న నిర్ణయాన్ని ఆదర్శంగా తీసుకుని, ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర కేబినెట్ కూడా 'అడ్వకేట్ ప్రొటెక్షన్ యాక్ట్ పై స్పష్టమైన, తక్షణ నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. న్యాయవాదుల విధి నిర్వహణకు ఎటువంటి ఆటంకం కలిగించినా, లేదా వారిపై భౌతిక దాడులకు పాల్పడినా, అలాంటి చర్యలను తీవ్రంగా పరిగణిస్తూ నాన్-బెయిలబుల్ కేసులుగా నమోదు చేసి కఠినమైన శిక్షలు విధించేలా చట్టంలో పటిష్టమైన నిబంధనలు ఉండాలని సూచించారు. అదేవిధంగా, రాష్ట్రంలోని అన్ని కోర్టు ఆవరణల్లో న్యాయవాదులు, కక్షిదారుల భద్రతను నిర్ధారించే విధంగా సమగ్ర భద్రతా చర్యలను వెంటనే అమలు చేయాలన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కేవలం హామీలకే పరిమితం కాకుండా, రాబోయే అసెంబ్లీ సమావేశాల్లోనే ఈ బిల్లును ప్రవేశపెట్టి చట్టరూపం దాల్చేలా తక్షణ చర్యలు చేపట్టాలని సూచించారు. న్యాయవాదుల న్యాయమైన డిమాండ్ల సాధన కోసం వారు చేపట్టబోయే పోరాటాలకు ఐ.ఏ.ఎల్ ఎల్లప్పుడూ అండగా నిలుస్తుందని ఆయన స్పష్టం చేశారు. ప్రభుత్వం ఈ విషయంలో స్పందించకపోతే రాష్ట్రవ్యాప్తంగా ఆందోళనలు చేపట్టడానికి వెనుకాడబోమని ఆయన హెచ్చరించారు.

# చౌడేశ్వరి అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పూజలు

**పులివెందుల - సూర్య వాస్తవం**

పులివెందుల పట్టణంలోని బ్రాహ్మణపల్లి రోడ్డు చౌడమ్మ వీధిలో కొలువైన శ్రీ రామలింగ చౌడేశ్వరి దేవస్థానంలో అమ్మవారికి భక్తి శ్రద్ధలతో పూజలు నిర్వహించారు. శుక్రవారము పురస్కరించుకుని ఉదయస్తమాన ఆలయ ప్రధాన అర్చకులు ప్రవీణ్ స్వామి ఆధ్వర్యంలో అమ్మవారికి సుప్రభాత సేవ విశేష పంచామృతాభిషేకం,కుంకుమార్చన ,మహా మంగళహారతి తదితర పూజా కైంకర్యాలు అనంతరం అమ్మవారు విశేష పూల అలంకారంలో చౌడేశ్వరి అమ్మవారు భక్తులకు దర్శనమిచ్చారు.ప్రత్యేకించి ఆలయున ఉదయం 10.30 నిమిషములకు రాహుకాల దీపాలు వెలిగించి రాహుకాల పూజలు నిర్వహించి అమ్మవారి ఆశీస్సులు పొందారు. ఈ సందర్భముగా ఆలయ నిర్వాహకులు రాజేంద్రప్రసాద్ ,అర్చకులు ప్రవీణ్ స్వామి మాట్లాడుతూ ప్రతి శుక్ర,పౌర్ణమి,అమావాస్య రోజున అమ్మవారికి భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారికి చీర వడిబయ్యము,కుంకుమార్చన,బోనాలు సమర్పించి తమ మొక్కలు చెల్లించుకోవడం జరుగుతుందన్నారు. శ్రీరామనవమి పండుగ సందర్భముగా శ్రీరామచంద్ర స్వామికి ప్రత్యేక పూజలు నిర్వహించారు.భక్తులకు పానకము,వడపప్పు ప్రసాదము వితరణ చేయుట జరిగినది..ఆలయ ప్రాంగణం మొత్తము అమ్మవారి నామస్మరణతో మార్మోగాయి. ఈ కార్యక్రమంలో ఆలయ నిర్వాహకులు ,భక్తాదులందరూ పాల్గొన్నారు.



## 45వ ఏడాది శ్రీ శ్రీ శ్రీ ఉమా యా గంటేశ్వర చలివేంద్రం

# ప్రారంభించిన త్రీటౌన్ సీఐ, ఎస్ఐ

**ప్రొద్దుటూరు - సూర్య వాస్తవం:**

శ్రీరామనవమి పర్వదినం సందర్భంగా స్థానికవైఎంఆర్ కాలనీలోని సరస్వతీ విద్యా మందిరం రోడ్డులో మేస్త్రి బాబయ్య ఆధ్వర్యంలో వరుసగా 45వ ఏడాది ఏర్పాటు చేసిన శ్రీశ్రీశ్రీ ఉమా యాగంటేశ్వర చలివేంద్రమును త్రీటౌన్ సీఐ రామాంజనేయుడు ఎస్సై మొయిను ద్దీన్లు ప్రారంభించారు ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బాబయ్య యాగంటి పుణ్యక్షేత్రంలో నాలుగు దశాబ్దాలు పైగా అన్నప్రసాద సేవలో తరిస్తూ వేసవిలో బాటసారుల దాహార్తిని తీర్చేందుకు చలివేంద్రాన్ని ఏర్పాటు చేసే మహా పుణ్య కార్యక్రమాన్ని నిర్వహించడం అభినందనీ యమని ప్రజలందరూ ఈ సదవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని సామాజిక బాధ్యతగా మనమందరము ఇటువంటి సేవలను స్ఫూర్తిగా తీసుకొని సమాజ హితం కొరకు కృషి చేద్దామని తెలియజేశారు రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ రాష్ట్ర ఉత్తమ ఉపాధ్యాయ అవార్డు గ్రహీత గజ్జల వెంకటేశ్వర రెడ్డి మాట్లాడుతూ నలభై ఐదు సంవత్సరాలుగా ఈ చలివేంద్రం ఏర్పాటు చేసి వేలాదిమంది ప్రజల దాహార్తిని తీర్చే మంచి కార్యక్రమంలో భాగస్వామి అయినందుకు మహాశివరాత్రి పర్వదినం రోజు యాగంటి పుణ్యక్షేత్రంలో అన్నప్రసాద సేవ చేస్తూ ఇక్కడ



ఈ పుణ్య కార్యక్రమాన్ని చేపట్టిన బాబయ్య వారి కుటుంబ సభ్యులను అభినందించారు చలివేంద్రం ప్రారంభం అనంతరం 300 మంది పైగా బాటసారులకు పానకం వడపప్పు పంపిణీ చేయడం జరిగింది ఈ కార్యక్రమంలో త్రీ టౌన్ సీఐ రామాంజనేయుడు ఎస్సై మొయినుద్దీన్ రోటరీ క్లబ్ ప్రెసిడెంట్ గజ్జల వెంకటేశ్వర రెడ్డి ఏఎస్ఐ సుబ్బన్న సీనియర్ జర్నలిస్టు షేక్ మహమ్మద్ రఫీ సంఘ సేవ న్యూస్ ఛానల్ అధినేత ఎండి అయూబ్ ఖాన్ మేస్త్రి బాబయ్య శివఖాసీం నాల్గవ వార్డు మాజీ కౌన్సిలర్ ఎస్ గుమ్మటమయ్య మురికూటి సూర్యనారాయణ రెడ్డి సాకం శేషారెడ్డి పాలగిరి రామకృష్ణారెడ్డి ఈశ్వర్ రెడ్డి దస్తగిరి బాలాజీ ప్రతాప్ శ్రీకాంత్ కమాల్ నవీన్ శివ బాలాజీ బాబయ్య కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

# స్నేహశీలి శ్రీరామ సుబ్బయ్య

## స్నేహ బృందం మధ్య శ్రీరామ్ జన్మదిన వేడుకలు

**పులివెందుల-సూర్య వాస్తవం**


పులివెందుల పట్టణ పరిధి లోని శిరిడి సాయిబాబా ఆలయ చైర్మన్ శ్రీరామ సుబ్బయ్య జన్మదిన వేడుకలు ఆత్మీయుల మధ్య ఘనంగా నిర్వహిం చారు. ముందుగా స్నేహితుల ఏర్పాటు చేసిన కేక్ కట్ చేసి శ్రీరామ్ సుబ్బయ్య కు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా పులివెందుల పట్టణ వైకాపా అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి మరియు స్నేహితులు మాట్లాడుతూ శ్రీరామనవమి పండుగ రోజు తన స్నేహితుడు శ్రీరామ్‌సుబ్బయ్య జన్మదినం రావడం కోదండ రాముడి ఆశీస్సులతో కూడినటువంటి అనుగ్రహమని, ఇలాంటి జన్మదిన వేడుకలు మరెన్నో



జరుపుకుంటూ ఆయురారోగ్యాలతో సుఖసంతోషాలతో శ్రీరాముని ఆశీస్సులు కలగాలని కోరుకోవడం జరుగుతుందని స్నేహబృందం తెలిపారు. ఈ కార్యక్రమంలో పండిత్ చంద్ర, సోముడు, తోటం శెట్టి హరి, రమేష్, చంద్రమౌళి, సింహం, శివ, ఇతర స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్‌సిఆర్ఏ పునరుద్ధరణ పై

# ప్రభుత్వానికి ధన్యవాదాలు తెలిపిన వికలాంగుల సమైక్య



**పామిడి -సూర్యవాస్తవం**

పామిడి మండలంలోని విశాల ఫెర్రర్ వికలాంగుల మండల సమాఖ్య ఆధ్వర్యంలో శుక్రవారం ఆర్ డి టి సంస్థకి ఎఫ్ సి ఆర్ ఏ మంజూరు కావడం తో స్థానిక జూనియర్ కళాశాల నందు ఫాదర్ విగ్రహాని కి పాలాభిషేకం చేసి పూల మాలవేసి, కేక్ కట్ చేసి సంబరాలు చేసుకోవడం జరిగింది. గత సంవత్సరం నుంచి సేవ్ ఆర్.డి. టి అనే నినాదంతో ఎంతోమంది దివ్యాంగులు అనంతపురం కలెక్టరేట్ ఎదురుగా రిలే నిరాహార దీక్షలు అయితేనేమి పోలికేక ఆధ్వర్యంలో కుల సంఘాలు చేపట్టిన పోరాటంలో ఎంతోమంది దివ్యాంగులు ఉద్యమంలో పాల్గొని ఆర్డిటి సంస్థకు ఎఫ్ సి ఆర్ ఎ మంజూరు చేయాలని ఉద్యమాలు చేయడం జరిగింది. ఆర్డిటి సంస్థకి ఎఫ్ సి ఆర్ ఏ మంజూరు అయిన సందర్భంలో ఎంతో మంది దివ్యాంగులకి మేలు జరుగుతుందనేది భావన. ముఖ్యంగా బుక్కరాయ సముద్రంలోని బుద్ధిమాంద్యత గల దివ్యాంగులకు సేవలు అందించడం పంగల్ రోడ్ లోని తల్లిదండ్రి లేని అనాధ పిల్లలకి సమ్మిళిత విద్య అందించడంలో బత్తలపల్లి,కళ్యాణదుర్గం హాస్పిటల్ దివ్యాంగులకు అందుతున్న సేవలు దివ్యాంగులందరికీ ఎఫ్ సి ఆర్ ఏ మంజూరు కావడం వల్ల ఎంతగానో ఉపయోగపడ తాయి. ఈ కార్యక్రమంలో ఏపి దివ్యాంగుల హక్కుల పోరాట సమితి ఉమ్మడి జిల్లా అధ్యక్షుడు హరినాథ్ రెడ్డి, వికలాంగుల హక్కుల జాతీయ వేదిక నాయకులు వసంతకుమార్, కో-ఆపరేటివ్ సొసైటీ బ్యాంక్ అధ్యక్షుడు భయపరెడ్డి, పామిడి విశాలా ఫెర్రర్ వికలాంగుల మండల సమాఖ్య సభ్యులు పాల్గొన్నారు.

# ఘనంగా పెనుకొండ గోనిపేట నానా దర్గా గంధం వేడుకలు

**అంగరంగా వైభవంగా జరిగిన పెనుకొండ గోనిపేట హాజరత్ షేక్ సయ్యద్ షా మొహమ్మద్ ఖమృద్దిన్ అలీ వారి గంధం, ఉరుసు వేడుకలు...**

**పెనుకొండ - సూర్య వాస్తవం**

పెనుగొండ ఆర్టీసీ బస్టాండ్ నుండి దర్గా ప్రాంగణం వరకు టపాసులు పేల్చుతూ పెద్ద ఎత్తున కార్లతో ఊరేగింపుతో జరిగిన దర్గా ఉరుసు వేడుకలు జరిగాయి. కుల మతాలకు అతీతంగా ఆంధ్ర, కర్ణాటక తమిళనాడు, మహారాష్ట్ర ల నుండి పెద్ద ఎత్తున తరలివచ్చిన పీర్, ముర్షిదలు, భక్తులు, మహిళలు. పిఠాధిపతులు, వేడుకల్లో సర్వమత సమ్మేళనం మత సామరస్యాన్ని చాటుకున్న హిందూ, క్రిస్టియన్, ముస్లింలు. ఈ కార్యక్రమంలో పాల్గొనటం జరిగింది. హీరూ ట్రస్ట్ చైర్మన్ అదిల్ గారు మరియు కలిముల్లా గారి ఆధ్వర్యంలో దుశ్శాలువతో ఘనంగా పలు ప్రముఖులకు సత్కరించారు. దర్గాలో ప్రత్యేక దువా నిర్వహించి ఆశీస్సులు అందజేశారు. వేలాది భక్తులకు పార్థ్యకంగా ఏర్పాటు చేసిన విందులో పాల్గొని కార్యక్రమశీ విజయవంతం చేసారు. అదేవిదంగా స్వామి వారి అశీసులు ప్రతి ఒక్కరికి ఉండాలని కోరూతు,



ముందరుండి కార్యక్రమం దిగ్విజయం చేసిన ప్రతి ఒక్కరికి ప్రేత్యేక ధన్యవాదములు తెలిపారు.

# ఘనంగా శ్రీరామనవమి వేడుకలు

## - రాముల వారి ఆశీస్సులు అందుకున్న ఎంపీ అవినాష్ రెడ్డి



**పులివెందుల - సూర్య వాస్తవం:** పులివెందుల పట్టణ పరిధిలోని నగరిగుట్టలో వెలసిన శ్రీ కోదండరామ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి పండుగ పురస్కరించుకొని సీతారాముల కళ్యాణం కమనీయంగా సాంప్రదాయంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాల్లో భాగంగా ఉదయాస్తమానం సీతారాముల వారికి ఆలయ ప్రధాన అర్చకులు పంచామృత అభిషేకం పట్టు వస్త్రాలతో గజమాలతో ప్రత్యేక అలంకరణ అనంతరం ఉత్సవమూర్తులకు ఉభయ దారులు ఆలయ ధర్మకర్త రామచంద్రారెడ్డి దంపతులచే స్వామివారి కళ్యాణం ఘనంగా నిర్వహించగా ,భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొని కళ్యాణం కమనీయంగా కళ్యాణ వేడుకలు వీక్షించారు.

ఆలయ నిర్వహకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు జిల్లా ఎంపీ అవినాష్ రెడ్డి, వైయస్ మనోహర్ రెడ్డి,లు కోదండ రామాలయం చేరుకోగా ఆలయ నిర్వహకులు ప్రత్యేక ఆహ్వానాన్ని పలికి ఆలయంలో పూజలు నిర్వహించి కళ్యాణ మహోత్సవాల్లో పాల్గొని స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆలయ నిర్వహకులు ఎంపీ అవినాష్ రెడ్డితో కలిసి ఆలయ అభివృద్ధికి కళ్యాణ మండపానికి కృషి చేయాలని విన్నవించుకున్నారు. అనంతరం ఎంపీ అవినాష్ రెడ్డి సానుకూలంగా స్పందించి రామాలయంలో కళ్యాణ మండపానికి అన్ని విధాల సహాయ సహకారాలు అందిస్తామని ఆలయ నిర్వహకులకు హామీ ఇచ్చారు. వాటిలో భాగంగా ఆలయ నిర్వహకులు ఏర్పాటుచేసిన అన్న ప్రసాద కార్యక్రమాలను భక్తులకు అందజేశారు. సాయంకాల సమయాన బాణసంచార, డీజే, మేల వాయిద్యాల మధ్య ఉత్సవమూర్తులు గ్రామోత్సవంగా కదలి వెళ్లగా భక్తులు కాయ కర్పూరం సమర్పించి మొక్కులు చెల్లించుకున్నారు. ఈ కార్యక్రమంలో పులివెందుల పట్టణ వైసిపి అధ్యక్షుడు హాల్ గంగాధర్ రెడ్డి, మాజీ కౌన్సిలర్ కోడి రమణ, పార్నపల్లి కిషోర్, లక్ష్మీ భార్గవి, లక్ష్మీ ప్రసన్న, పద్మనాభరెడ్డి, శ్యామల నర్సారెడ్డి, ఆలయ నిర్వహకులు మాచిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, చెన్నారెడ్డి, ప్రతాపరెడ్డి, భక్తులు సేవా కార్యకర్తలు ఉభయదారుల బంధుమిత్రులు తదితరులు పాల్గొన్నారు.



**తనకల్లు మండల పరిధిలో...** శ్రీ సత్య సాయి జిల్లా తనకల్లు మండల పరిధిలోని పెద్దపల్లి గ్రామం నందు అయోధ్య రామ మందిరం నమూనాని ముంబాయికి చెందిన టెక్నీషియన్ తో శరవేగంతో అచ్చు ఉన్నట్లు శ్రీ రామ మందిరాన్ని చిత్రికించిన మైనార్టీ సోదరుడు ముక్తియార్ భాష ఆధ్వర్యంలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించినారు. ఆంధ్ర కర్ణాటక సరిహద్దుల్లో ఉన్న పెద్దపల్లి గ్రామంలో 9 రోజులపాటు నిర్వహించే శ్రీరాముని ఉత్సవాలు ను చుట్టుపక్కల గ్రామాల నుంచి తండోపతండవులుగా ప్రజలు తరలివచ్చిన అయోధ్య రామ మందిరం నమూనాని కళ్ళారా చూసి తరించినారు భక్తులు వచ్చే వారికి సరైన సదుపాయాలు కల్పించి ఉచిత బస్సు ప్రయాణం ఏర్పాటు చేశారు ఈ ప్రతిష్టను చూసేకి నలుమూల నుండి భారీగా తరలివచ్చిన ప్రజలు మత సామర్థ్యానికి నిలిచిన మైనార్టీ సోదరుడు ముక్తియార్ భాష కు పెద్దపల్లి గ్రామ ప్రజలు కృతజ్ఞతలు తెలిపారు.



**ఉరవకొండ పందికుంట గ్రామంలో....**

వజ్రకరూర్ మండలంలోని పందికుంట గ్రామంలో శ్రీరామనవమి సందర్భంగా గ్రామస్తులు ఆధ్వర్యంలో సీతారాముల కళ్యాణం ప్రతి సంవత్సరం లాగే వైభవంగా నిర్వహించడం జరిగింది.గ్రామ ప్రజలు భక్తి శ్రద్ధలతో పాల్గొని తీర్థ ప్రసాదాలు స్వికరించి మొక్కులు చెల్లించుకున్నారు. సాయంత్రం రతోత్సవం జైశ్రీరామ్ నినాదాలతో కన్నుల పండగగా జరిగింది.

**ఇల్లూరులో....** గార్లదిన్నె మండలం ఇల్లూరులో వెలసిన కోదండ రామాలయం నందు శ్రీరామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని కోదండ రాముడు (రాము )దంపతుల చేతుల మీదుగా సీతారాముల కళ్యణ మహోత్సవంలో అంగరంగ వైభవంగా జరిగిశీది. వారు మాట్లాడుతూ,సీతారాముల కళ్యాణశీ తమ చేతుల మీదుగా జరగడం సంతోషంగా ఉందని తెలియజేశారు .శ్రీరామనవమి పండుగ సందర్భంగా స్వామివారి కల్యాణోత్సవం జరుపుకోవడం గ్రామ ప్రజలంతా ఆయురారోగ్యలతో సుఖసంతోషాలతో ఉండాలని పంటలు బాగా పండాలని సకాలంలో వర్షాలు బాగా పడి రైతులు ఆనందంతో ఉండాలని ఆ సీతారాముల స్వామి వారిని వేడుకోవడం భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొని అన్నదానం స్వీకరించడం జరిగింది.





# స్టీల్ ప్లాంట్ క్రెడిట్ వార్






**విశాఖపట్టణం-సూర్య వాస్తవం:**

అనకాపల్లి జిల్లా నక్కపల్లి రాజయ్యపేట లో ఏర్పాటు కానున్న ఆర్సెలార్ మిట్టల్ నిప్పన్ స్టీల్ ప్లాంట్ చుట్టూ ఇప్పుడు ఆంధ్రప్రదేశ్ రాజకీయాల్లో పెద్ద క్రెడిట్ వార్ నడుస్తోంది. మార్చి 23, 2026న ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఈ మెగా ప్రాజెక్టుకు శంకుస్థాపన చేయగా, దీనిపై మాజీ సీఎం జగన్ మోహన్ రెడ్డి చేసిన వ్యాఖ్యలు, దానికి టీడీపీ ఇచ్చిన కౌంటర్లు సోషల్ మీడియాలో హాట్ టాపిక్‌గా మారాయితాడేపల్లిలో అద్దంకి పార్టీ కార్యకర్తలతో జరిగిన సమావేశంలో జగన్ మాట్లాడుతూ.. ఈ ప్రాజెక్టుకు పునాది పడింది తన హయాంలోనే అని స్పష్టం చేశారు. 2022లో దావోస్ పర్యటనలో తాను ఆదిత్య మిట్టల్‌తో చర్చలు జరిపానని, నక్కపల్లితో పాటు పలు ప్రాంతాలను వారికి చూపించామని గుర్తు చేశారు. ఎన్నికలకు ముందే ఈ ప్లాంట్ ఖరారైందని, ఇప్పుడు చంద్రబాబు దీనిని తన ఖాతాలో వేసుకోవాలని చూడటం క్రెడిట్ చోరీ అని విమర్శించారు. జగన్ వ్యాఖ్యలపై టీడీపీ నేతలు ఘాటుగా స్పందిస్తున్నారు. గతంలో జగన్ ఒక ప్రెస్ మీట్ లో మాట్లాడుతూ.. ఆర్సెలార్ మిట్టల్ ప్లాంట్ ఒడిశాలో వస్తోంది.. బాబు మాత్రం ఏపీకి వస్తుందంటూ జనం చెవిలో పూలు పెడుతున్నారు అని అన్న విషయాన్ని వారు గుర్తు చేస్తున్నారు. ఒడిశాకు వెళ్తుందన్న ప్లాంట్ ఇప్పుడు ఏపీకి ఎలా వచ్చింది? మీ హయాంలో ఒప్పందం జరిగితే అప్పుడే ఎందుకు శంకుస్థాపన చేయలేదు? అంటూ సోషల్ మీడియా వేదికగా నిలదీస్తున్నారు.సుమారు 1.36 లక్షల కోట్ల పెట్టుబడితో రానున్న ఈ ప్లాంట్, విశాఖ స్టీల్ ప్లాంట్ కంటే పెద్దదని ప్రభుత్వం చెబుతోంది. దీని ద్వారా ప్రత్యక్షంగా, పరోక్షంగా సుమారు లక్ష మందికి ఉపాధి లభిస్తుందని అంచనా.

2028 డిసెంబర్ నాటికి ఉత్పత్తి ప్రారంభం కావచ్చని అధికారులు వెల్లడించారు.ఒకవైపు వైఎస్సార్‌సీపీ మేము తెచ్చిన ప్రాజెక్టును బాబు వాడుకుంటున్నారు అని ప్రచారం చేస్తుంటే, మరోవైపు టీడీపీ జగన్ హయాంలో పరిశ్రమలు పారి పోయాయి.. కూటమి ప్రభుత్వం వల్లే పెట్టుబడులు వస్తున్నాయి అని కౌంటర్ ఇస్తోంది. ఈ క్రెడిట్ వార్ ప్రస్తుతం ఏపీ పాలిటిక్స్‌లో సెంటర్ ఆఫ్ అట్రాక్షన్‌గా మారింది.

## పండుగ రోజూ తప్పని నీటి కష్టాలు



**వేంపల్లె- సూర్య వాస్తవం:** శ్రీ రామ నవమి పండుగ రోజు కూడా మారుతి నగర్ వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. ఇడుపులపాయ గ్రామ పంచాయతీలోని మారుతి నగర్ కాలనీలో గత ఆరు రోజుల క్రితం తాగునీటి పైపు లైను పగిలి పోయింది. దీంతో ఆ కాలనీ వాసులకు నీటి కష్టాలు తప్పడం లేదు. వైకాపా నాయకులు పోతిరెడ్డి మహేష్ ఈ విషయాన్ని జడ్పిటిసి మాచిరెడ్డి రవి కుమార్ రెడ్డి దృష్టికి తీసుకెళ్లి తన సొంత నిధులు వెచ్చించి మారుతి నగర్ కాలనీ వాసులకు ట్యాంకర్ల ద్వారా నీటిని సరఫరా చేస్తున్నారు. ఆరు రోజులుగా ప్రజలు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నా అధికారులు మాత్రం పట్టించుకున్న పాపాన పోలేదు. అధికారులు పైపు లైను మరమ్మత్తులు చేయకపోవడంతో పండుగ రోజు కూడా ప్రజలు నీటి కోసం పడిగాపులు కాయాల్సి వచ్చింది. పోతిరెడ్డి మహేష్ పండుగ రోజు ట్యాంకర్ ద్వారా ప్రజలకు తాగునీటి ని సరఫరా చేశారు. దీంతో స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. అధికారులు పైపు లైను మరమ్మత్తులు చేసి తాగునీటి సమస్య లేకుండా చూడాలని ఆ గ్రామ ప్రజలు కోరుతున్నారు.

## వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం పంపిణీ



**లింగాల -సూర్య వాస్తవం :** పులివెందుల పట్టణానికి చెందిన కోడెదెల హుస్సేన్ అమ్మ మూడవ వర్ధంతి సందర్భంగా లింగాల మండలం ఇప్పట్ల గ్రామం వద్ద ఉన్న శ్రీ లీలావతి వృద్ధాశ్రమంలో వృద్ధులకు అల్పాహారం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఉదయం పొంగలి, వడ, లడ్డూలతో పాటు కారాలు వడ్డించి వృద్ధులకు సేవలు అందించారు. ఈ కార్యక్రమాన్ని ఆమె కుటుంబ సభ్యులు భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. కుమారుడు కోడిదల కులాయప్ప (రిటైర్డ్ తాసిల్దార్), ఆయన సతీమణి కోడిదల మహా బున్ని , కుమారుడు రాజా, కోడలు జాస్మిన్, మనవడు విహాన్ .మరియు బంధుమిత్రులు పాల్గొని వృద్ధులతో కలిసి సమయం గడిపారు. ఈ సందర్భంగా కుటుంబ సభ్యులు మాట్లాడుతూ, హుస్సేన్ అమ్మ స్మృతిని నిలుపుకుంటూ ప్రతి సంవత్సరం ఇలాంటి సేవా కార్యక్రమాలు నిర్వహించడం తమ బాధ్యతగా భావిస్తున్నట్లు తెలిపారు. ఈ కార్యక్రమంలో విజయోథెరపీ రిటైర్డ్ డాక్టర్ వెంకటరామిరెడ్డి టీచర్ బాబు తదితరులు పాల్గొన్నారు.

# వాడవాడలా... అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

## అంగరంగ వైభవంగా శ్రీరామనవమి వేడుకలు

**లింగాల- సూర్య వాస్తవం:**



లింగాల మండల పరిధిలోని గ్రామాల్లో శుక్రవారం శ్రీరామాలయాల్లో ప్రజలు భక్తి శ్రద్ధలతో శ్రీరామనవమి వేడుకలను ఘనంగా నిర్వహించా రు. ఈ సందర్భంగా ఆలయాల్లో ని సీత సమేత శ్రీరాముని విగ్రహాలకు అర్చకులు కళ్యాణం తోపాటు పూజలు నిర్వహించారు. అలాగే మండల పరిధిలోని గ్రామాల్లో గ్రామస్తుల ఆధ్వర్యంలో శుక్రవారం మధ్యాహ్నం 12 గంటల నుంచి పెద్ద ఎత్తున అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. అనంతరం సాయంత్రం మూడు గంటల నుంచి సీతా సమేత శ్రీరామ,లక్ష్మణ విగ్రహాలను మంగళ వాయిద్యాలతో ఘనంగా గ్రామాల్లోని వీధుల్లో మేలతాళాలతో ఊరేగించారు. ఈ కార్యక్రమాల్లో ఆయా గ్రామాల ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## భక్తిశ్రద్ధలతో సీతారాములోరి కళ్యాణం

**తొండూరు - సూర్య వాస్తవం:**



శ్రీరామనవమి పండగ సందర్భంగా తొండూరు మండలం లోని కృష్ణంగారి పల్లె,సైదాపు రం,బూచు పల్లి,తదితర గ్రామాల్లో శ్రీరామాలయంలో శుక్రవారం శ్రీసీతారాముల కళ్యాణం వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వేద పండితులు శ్రీసీతారామ,లక్ష్మణ,ఆంజనేయస్వామి విగ్రహాలను ప్రత్యేకంగా అలంకరించి పూజలు నిర్వహించారు. అనంతరం వారు సీతారాముల కల్యాణాన్ని వేదమంత్రోచరణల మధ్య నిర్వహించారు. భక్తులకు పానకం వడపప్పు పంపిణీ చేశారు. అనంతరం మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయా గ్రామస్తులు మహిళలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

## జల్లిపల్లిలో ఘనంగా సీతారాముల కళ్యాణ మహోత్సవం





కూడేరు మండలం జల్లిపల్లి గ్రామంలో వెలసిన శ్రీ కోదండ రామస్వామి వారి దేవాలయంలో సీతారాముల కళ్యాణ మహోత్సవం కన్నుల పండగగా జరిగింది. అనంతరం స్వామివారి ఉత్సవ మూర్తులను జల్లిపల్లి పురవీధులలో కోలాట గురువు సుజాత ఆధ్వర్యంలో ఆడపడుచులు, పిల్లల కోలాటాల మధ్య ఎంతో శోభాయ మానంగా ఊరేగింపు అంగరంగ వైభవంగా జరిగింది. అనంతరం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో గ్రామ పెద్దలు ప్రజలు పార్టీలకు అతీతంగా అందరూ పాల్గొని ఎంతో ఆనందంగా శ్రీరామనవమి వేడుకలు జరుపుకున్నారు.

## అంగరంగ వైభవంగా సీతారామ కళ్యాణం

**బ్రహ్మంగారిమఠం - సూర్య వాస్తవం:**



శ్రీరామనవమి పండుగ సందర్భంగా మండల కేంద్రంలోని పాతూరు గ్రామంలోని రామాలయం వద్ద శ్రీ సీతారాముల కళ్యాణోత్సవం అంగరంగ వైభవంగా జరిగింది. ఈ కార్యక్రమంలో తిప్పన మాధవ నాయుడు వీరి ధర్మపత్ని సుశీల,ఇటికల వెంకటేశ్వర్లు,నీలిమ గార్లు కలిసి శుక్రవారం ఉదయం కళ్యాణం నిర్మించడం జరిగింది. మధ్యాహ్నం అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. రాత్రికి శ్రీ సీతారామ విగ్రహాలను బ్రహ్మంగారిమఠంలోని పురవీధుల్లో ఊరేగింపు కార్యక్రమం నిర్వహించారు. ఊరేగింపు వెంట కీర్తిశేషులు చంద్రావతమ్మ జ్ఞాపకార్థం వీరి కుమారుడు దత్తాత్రేయ స్వామి మహా ప్రసాదశీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో పాతూరు గ్రామస్తులు,భక్తులు విరివిగా పాల్గొన్నారు.

## శ్రీరామనవమి వేడుకలలో చింతకుంట సుధీకర్ రెడ్డి

**పులివెందుల- సూర్య వాస్తవం**



పులివెందుల పట్టణ పరిధిలోని పడమర ఆంజనేయ స్వామి ఆలయంలో శుక్రవారం శ్రీరామనవమి వేడుకలు సీతారాముల కళ్యాణం అంగరంగ వైభవంగా నిర్వహించారు. ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా గ్రూప్ ఆఫ్ టెంపుల్ మాజీ ,తాత్కాలిక చైర్మన్ చింతకుంట సుదీకర్ రెడ్డి రాములవారి సీతారాముల కళ్యాణ వేడుకలలో పాల్గొని వేద పండితులచే ఆశీర్వచనాలు అందుకున్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముందుగా ప్రతి ఒక్కరికి శ్రీరామనవమి పండుగ శుభాకాంక్షలు తెలియజేస్తూ, రాముల వారి ఆశీస్సులతో ప్రతి ఇంటిలో సుఖశాంతులు ఆయురారోగ్యాలు సిరిసంపదలు కలగాలని కోరుకోవడం జరుగుతుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో ఎండోమెంట్ ఈవో రమణ ఆలయ నిర్వహకులు భక్తులు తదితరులు పాల్గొన్నారు.



జక్కలచెరువు రామాలయం లో జరిగిన సీతారాముల కళ్యాణం ను దర్శించుకున్న

## సింగనమల మార్కెట్ యార్డ్ చైర్మన్ దండు శ్రీనివాసులు

**శింగనమల- సూర్య వాస్తవం :**

శ్రీరామనవమి పండుగ సందర్భంగా గుత్తి మార్కెట్ యార్డు చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్,జక్కలచెరువు గోవిందు ఆహ్వానం మేరకు గుత్తి మండలం జక్కలచెరువు లోని రామాలయంలో జరిగిన సీతారాముల కళ్యాణం కి తనయుడు దండు సతీష్ తో కలిసి హాజరై సీతారాములను దర్శించుకన్న శింగనమల మార్కెట్. యార్డు చైర్మన్ దండు శ్రీనివాసులు. ఈ కార్యక్రమంలో దండు శ్రీనివాసులు మాట్లాడుతూ సీతా రాముల వారి కళ్యాణమునకు వచ్చి ఆ స్వామివారి ఆశీస్సులు పొందినందుకు నాకు చాలా సంతోషంగా ఉన్నదని ఈ కార్యక్రమానికి నన్ను నా కుమారుడిని ఆహ్వానించిన గుత్తి మార్కెట్ యార్డ్ చైర్మన్ జక్కలచెరువు ప్రతాప్ కి, జక్కలచెరువు గోవిందుకి నా హృదయపూర్వక నమస్కారములు అని తెలిపారు. ఈ కార్యక్రమం లో మాజీ జెట్పీ టి సి రామకృష్ణ, శింగనమల బిసి సెల్ అధ్యక్షులు బెస్త నారాయణ స్వామి,గుమ్మెపల్లి రంగస్వామి,మాజీ ఎంపీ టి సి అకులేడుమల్లికార్జున, నల్లప్ప,దండు రామదాసు,యోగ పాల్గొన్నారు

## పేద కుటుంబానికి నిత్యవసర సరుకులు పంపిణీ

**పులివెందుల -సూర్య వాస్తవం :**



పులివెందుల మండల పరిధిలోని ఎర్రబెల్లి హరిజనవాడలో శ్రీరామనవమి వేడుకలు ఘనంగా నిర్వహించగా ఈ కార్యక్రమాలకు ముఖ్య అతిథిగా పులివెందుల అర్బన్ సీఐ శ్రీరామ్ హాజరయ్యారు. శుక్రవారం శ్రీరామ నవమి పండుగను పురస్కరించుకొని హరిజనవాడలో ఉన్న ఒక పేద కుటుంబంలో కుటుంబ యజమాని చనిపోయి అతనికి సంతానం నలుగురు బిడ్డలు ఒక తల్లి ఉన్నటువంటి వారి కుటుంబ దీన పరిస్థితి గమనించి డిష్ వెంకట్రామిరెడ్డి లింగారెడ్డి ఉమ్మారెడ్డిలు కలిసి బియ్యం మూటలు నిత్యవసర,సరుకులు పులివెందుల అర్బన్ సిఐ శ్రీరామ్ చేతుల మీదుగా కుటుంబ సభ్యులకు అందజేశారు. ఈ సందర్భంగా సిఐ శ్రీరామ్ మాట్లాడుతూ ముందుగా ప్రతి ఒక్కరికి శ్రీరామనవమి శుభాకాంక్షలు తెలియజేశారు. ఒక పేద కుటుంబం ఆర్థిక పరిస్థితిని గమనించి చేయూతనందించడం మంచి విషయమని, ప్రతి ఒక్కరిలోనూ సేవా భావం అలవర్చుకోవాలని, దాతల సాయం మరువలేనిది అని వారిని అభినందించారు. ఈ కార్యక్రమంలో గ్రామస్తులు తదితరులు పాల్గొన్నారు.

## అనంతపురం లో వెల్లివిరిసిన మత సామరస్యం..!

### శ్రీరామనవమి శోభాయాత్రలో వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్స్ అందజేసిన ముస్లిం సోదరులు



**అనంతపురం - సూర్య వాస్తవం :**



అనంతపురం నగరంలో హిందూ-ముస్లిం సోదరులు మతాలకు అతీతంగా కలిసిమెలిసి ఉంటూ... శ్రీరామనవమి శోభాయాత్రలో హిందూ సోదరులకు ముస్లింలు వాటర్ బాటిల్స్, కూల్‌డ్రింక్స్ పంచిపెట్టి మతసామరస్యాన్ని చాటుకుంటున్నారు. శుక్రవారం నాడు నవమి వేడుకల్లో భాగంగా నిర్వహించిన రామయ్య శోభాయాత్రలో ముస్లిం మైనారిటీలు వాటర్ బాటిళ్లు, కూల్ డ్రింక్స్ పంచి.. వేసవి తాపం తీర్చారు. అనంతరం....వారితో ఆలింగనం చేసుకుని నవమి శుభాకాంక్షలు తెలిపారు. శోభాయాత్రలో పాల్గొన్న ప్రజలకు ముస్లిం యువకులు రామనవమి శుభాకాంక్షలు తెలిపారు. ముస్లిం మైనారిటీలు చేసిన పనికి పలువురు ధన్యవాదాలు తెలిపారు.

### చంద్రపల్లిలో కన్నుల పండుగగా సీతారాముల కళ్యాణం

**ప్యాపిలి -సూర్య వాస్తవం :**రామనవమి పర్వదినాన్ని పురస్కరించుకొని చంద్ర పల్లి గ్రామంలో శుక్రవారం సీతారాముల కళ్యాణం మహోత్సవం శ్రీ రామ మహాపట్టాభిషేకం కోదండ రామాలయంలో సీతారాముల పరిణయ వేదిక పై వైభవంగా చెక్కిలం ప్రసాదరావు, చెక్కిలం సుహాసిని దంపతులు,గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ఘనంగా జరిగింది, తిలకించేందుకు చుట్టుపక్కల భక్తాదులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు,సీతారాముల కల్యాణానికి ఆధ్యాత్మికత భక్తకోటి మురిసేలా ఘనంగా ఏర్పాట్లు చేశారు. నవమి ఉత్సవాల్లో భాగంగా ఆలయ పండితులు ఎదుర్కోలు ఉత్సవం నిర్వహించారు.

## జిల్లా పోలీస్ హెడ్ క్వార్టర్స్‌లో ఘనంగా శ్రీరామ నవమి వేడుకలు

### ముఖ్య అతిథిగా పాల్గొన్న జిల్లా ఎస్పీ జగదీష్ దంపతులు

**జిల్లా ఎస్పీ, ఆయన సతీమణి హేమ జగదీష్ ఆధ్వర్యంలో ఘనంగా శ్రీసీతారాముల వారి కళ్యాణోత్సవ కార్యక్రమం**

**ఆనందోత్సవాల మధ్య వైభవంగా కొనసాగిన శ్రీరామ నవమి వేడుకలు**







**అనంతపురం క్రైమ్ - సూర్య వాస్తవం :**

అనంతపురం జిల్లా పోలీసు హెడ్ క్వార్టర్స్ లోని శ్రీ కోదండ రామాలయంలో శుక్రవారం నాడు శ్రీరామ నవమి వేడుకలు ఘనంగా జరిగాయి. జిల్లా ఎస్పీ పి.జగదీష్, ఆయన సతీమణి హేమ జగదీష్, ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ముందుగా... స్వామి వార్ల పట్టు వస్త్రాలు, ముత్యాల తలంబ్రాలు దేవతా మూర్తులకు సమర్పించారు. అనంతరం ...జిల్లా ఎస్పీ దంపతుల చేతుల మీదుగా శ్రీ సీతారాముల వారికి కళ్యాణం జరిపారు. జిల్లా ప్రజలు సుఖసంతోషాలతో ప్రశాంతంగా జీవించాలని ఎస్పీ దంపతులు శ్రీ సీతారాముల స్వామి వార్లను వేడుకున్నారు. శ్రీ సీతారాముల వారి కళ్యాణం తర్వాత భారీ ఎత్తున జిల్లా ఎస్పీ చేతుల మీదుగా అన్నదానం కార్యక్రమం నిర్వహించారు. ఈకార్యక్రమంలో ట్రైనీ ఐ.పి.ఎస్ అధికారి అశ్విన్ మణిదీప్, ఏ.ఆర్ డీఎస్పీ నీలకంఠేశ్వరరెడ్డి, మహిళా విభాగం డీఎస్పీ ఎస్ మహబూబ్ బాషా, డిటిసి డీఎస్పీ సూర్యనారాయణరెడ్డి, సి.ఐ లు ధరణీకిశోర్, హేమంత్ కుమార్, జయపాల్ రెడ్డి, ఆర్ ఐ లు మధు, పవన్ కుమార్, రాముడు, జిల్లా పోలీసు కార్యాలయం బి సూపరింటెండెంట్ ప్రసాద్, జిల్లా పోలీసు అధికారుల సంఘం అడహాక్ కమిటీ సభ్యులు, పోలీసు కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

## డ్రోన్ నిఘా తో పట్టణంలో కట్టుదిట్టమైన పర్యవేక్షణ

### సీఐ టి.నరసింహులు

**వేంపల్లె- సూర్య వాస్తవం**



పట్టణంలో అసాంఘిక కార్యకలాపాలను అరికట్టేందుకు పోలీసులు వినూత్న చర్యలు చేపట్టారు. గండి రోడ్డు, ప్రభుత్వ డిగ్రీ కళాశాల పరిసరాలు, గవి మల్లేశ్వరస్వామి ఆలయ ప్రాంతాల్లో డ్రోన్ల సహాయంతో ప్రత్యేక తనిఖీలు నిర్వహించినట్లు సీఐ టి.నరసింహులు తెలిపారు. ఈ డ్రోన్ సర్వేలెన్స్ ద్వారా అనుమానాస్పద వ్యక్తుల కదలికలను గుర్తించి, వెంటనే చర్యలు తీసుకునే అవకాశం ఉంటుందని తెలిపారు. ముఖ్యంగా సాయంత్రం మరియు రాత్రి వేళల్లో ఈ తనిఖీలు మరింత కట్టుదిట్టం చేసినట్లు చెప్పారు. ప్రజలు కూడా తమ పరిసరాల్లో అనుమానాస్పద వ్యక్తులు కనిపిస్తే వెంటనే పోలీసులకు సమాచారం అందించాలని సీఐ విజ్ఞప్తి చేశారు. శాంతిభద్రతలు కాపాడటం పోలీసుల కర్తవ్యం అని అన్నారు.

## కన్నుల పండుగగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవం

**వేంపల్లె - సూర్య వాస్తవం**



వేంపల్లెలోని స్థిత ప్రజ్ఞ కాలనీలో వెలసిన (టీచర్స్ కాలనీలోని) శ్రీ రామాలయంలో శ్రీరామనవమి ఉత్సవాలు ఘనంగా నిర్వహించామని ఆలయ కమిటీ సభ్యులు తెలిపారు. ఇందులో భాగంగా శ్రీ సీతారాముల వారి కల్యాణోత్సవం అంగరంగ వైభవంగా నిర్వహించారు. అర్చకులు మురళీ నేతృత్వంలో వేద మంత్రోచ్చారణతో మంగళవాయిద్యాల,అశేష జన సందోహం నడుమ కన్నుల పండుగగా నిర్వహించారు. ఉదయం ఆలయంలో శ్రీ సీతారామలక్ష్మణహనుమంత వారికి విశేష పూజలు నిర్వహించారు. అనంతరం రోజామాలలతో అలంకరించి భక్తులకు దర్శనం కల్పించారు. స్వామివారికి నివేదన,మహా మంగళ హారతి తదితర పూజా కార్యక్రమాలు నిర్వహించామన్నారు. అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. సీతారాముల కళ్యాణంలో తలంబ్రాలు,పానకం,వడపప్పు పంపిణీ చేశారు.

# పెద్ది.. మరోసారి తారక్ కనెక్షన్స్




రామ్ చరణ్ 'పెద్ది' సినిమా అప్‌డేట్స్ వస్తున్న కొద్దీ ఒక పాత వార్త మళ్ళీ నెట్టింట హల్చల్ చేస్తోంది. దర్శకుడు బుచ్చిబాబు సానా ఈ సినిమా కంటే ముందు దాదాపు రెండేళ్ల పాటు జూనియర్ ఎన్టీఆర్ చుట్టూ తిరిగిన విషయం అందరికీ తెలిసిందే. అప్పట్లో తారక్ కోసం ఆయన ఒక కుస్తీ నేపథ్యంలో సాగే కథను సిద్ధం చేశారని ఇండస్ట్రీలో గట్టిగా వినిపించింది. అయితే కొన్ని కారణాల వల్ల ఆ ప్రాజెక్ట్ పట్టాలెక్కకపోవడంతో, అదే కథను ఇప్పుడు చరణ్ తో తీస్తున్నారా అనే అనుమానం చాలా మందిలో కలుగుతోంది. నిజానికి ఎన్టీఆర్ కోసం బుచ్చిబాబు అనుకున్న కథలో హీరో ఒక యాక్సిడెంట్ లో కాళ్లు కోల్పోతాడని, ఆ తర్వాత కుస్తీ టీమ్‌కు కోచ్‌గా మారి తన కల నెరవేర్చుకుంటాడని అప్పట్లో ప్రచారం జరిగింది. చరణ్ తో సినిమా అనౌన్స్ చేసినప్పుడు మాత్రం బుచ్చిబాబు ఒక మాట చెప్పారు.

తారక్ కు చెప్పిన కథ వేరని, చరణ్ కోసం రాసుకున్నది అసలు సంబంధం లేని కొత్త సబ్జెక్టు అని క్లారిటీ ఇచ్చారు. కానీ విడుదలైన 'పహిల్వాన్' గ్లింప్స్ చూశాక సోషల్ మీడియాలో సీన్ మొత్తం మారిపోయింది. ఫ్యాన్స్ ఫిదా ఈ గ్లింప్స్ లో చరణ్ ఒక పక్కా కుస్తీ యోధుడిలా, ఆ బాడీ లాంగ్వేజ్ తో కనిపిస్తుంటే అందరికీ తారక్ కు చెప్పిన పాత కథే గుర్తొస్తోంది. అప్పట్లో కుస్తీ కోచ్ గా ఎన్టీఆర్ ను ఊహించుకున్న వాళ్లంతా, ఇప్పుడు చరణ్ ను అదే గెటప్ లో చూసి ఇది కచ్చితంగా ఆ పాత స్క్రిప్టే అని ఫిక్స్ అయిపోతున్నారు. ఒకవేళ అదే కథ అయితే, అప్పుడు అనుకున్న కుస్తీ పాయింట్ కు ఇప్పుడు క్రికెట్ ఎలిమెంట్స్ ను కూడా జోడించి బుచ్చిబాబు ఏదో కొత్త మ్యాజిక్ చేస్తున్నట్లు అనిపిస్తోంది. ఫోటోలు వైరల్ ఒక స్టార్ హీరో కోసం రెండేళ్లు కష్టపడి రాసుకున్న కథను వదులుకోలేక, దానికే కొన్ని మార్పులు చేసి చరణ్ ఇమేజ్ కు తగ్గట్టుగా సెట్ చేశారనేది ఇప్పుడు వినిపిస్తున్న మాట. గ్లోబల్ స్టార్ గా ఎదిగిన చరణ్ కు ఇలాంటి ఒక ఇంటెన్స్ ఎమోషనల్ రోల్ పడితే ఆయన కెరీర్ కు అది పెద్ద ప్లస్ అవుతుంది. కానీ బుచ్చిబాబు మాత్రం మొదటి నుంచీ ఇవి రెండు వేర్వేరు కథలని చెబుతూనే వస్తున్నారు.

ఈ కన్ఫ్యూజన్ మీద దర్శకుడు మళ్ళీ ఏమైనా స్పందిస్తాడేమో చూడాలి. ఏప్రిల్ 30న ఈ సినిమా థియేటర్లలోకి రాబోతోంది. అప్పటివరకు ఈ కథల చర్చలు సాగుతూనే ఉంటాయి. చరణ్ ఒక పహిల్వాన్ గా తన విశ్వరూపాన్ని చూపించడానికి రెడీ అవుతుంటే, మేకర్స్ మాత్రం ఈ పాత కథల పోలికల మీద సైలెంట్ గానే ఉంటున్నారు. బుచ్చిబాబు తన స్ట్రాటజీతో ఈ పాత కథనే కొత్తగా ఎలా ప్రజెంట్ చేస్తారో తెలియాలంటే సినిమా రిలీజ్ వరకు ఆగాల్సిందే.

## ఆ రోజు కోసం ఎదురుచూస్తున్నా...



ఇటీవల ముంబైలో జరిగిన 'ది హాలీవుడ్ రిపోర్టర్' నిర్వహించిన ఓ కార్యక్రమంలో సమంత పాల్గొన్నారు. వినోద రంగంలో మహిళల పాత్ర గురించి, సాధారణ మహిళలు ఎలా ఉంటారు అనే విషయాలపై ఆమె కార్యక్రమంలో మాట్లాడారు. 'మహిళలు తమ వృత్తి జీవితంలోనూ, వ్యక్తిగత జీవితంలోనూ ఎన్నో సంద ర్భాలలో రాజీ పడుతుంటారు. వారు చేసే త్యాగాలను సైతం గుర్తించలేరు. తమ వారికోసం నిస్వార్థంగా అలా చేస్తుంటారు. ఎవరైనా తమను మెచ్చు కుంటే కూడా వెంటనే దాన్ని పాజిటివ్‌గా తీసుకోవడానికి ఆలో చిస్తుంటారు. కానీ అలా అనుకోవాల్సిన అవసరం లేదు. ఎవరు అభినందించినా మనస్ఫూర్తిగా స్వీకరించండి. ఇక సినిమా రంగంలో మహిళలకు తగిన గుర్తింపు లేదు. హీరో భార్యగా తెర మీద కనిపించే కథానాయిక పాత్రలకు కాలంచెల్లే రోజు రావాలి. 'ఉమెన్ సెంట్రిక్ మూవీ' అనే పదాన్ని ఉపయోగించకుండా అలాంటి చిత్రాలకు సహజమైన గుర్తింపు లభించాలి. ఈ రంగంలో మహిళలకు భద్రత ఉన్నప్పుడే ఎవరైనా ఈ రంగంలోకి రాగలరు. కానీ ప్రస్తుతం అలాంటి పరిస్థితులు లేవు. అయితే ఏదో ఒక రోజు ఖచ్చితంగా మహిళలకు ఈ రంగం అనువైనదిగా మారుతుంది. అలాంటి రోజు కోసం నేను ఎదురు చూస్తున్నా' అన్నారు.

## ఏప్రిల్ 17న 'బ్యాడ్ బాయ్ కార్తీక్'



నాగశౌర్య నటిస్తున్న 'బ్యాడ్ బాయ్ కార్తీక్' మూవీ రిలీజ్ డేట్‌ను తాజాగా చిత్ర బృందం ప్రకటించింది. గత ఏడాదే షూటింగ్ పూర్తి చేసుకున్న ఈ చిత్రం ఇప్పటికీ విడుదల కాలేదు. తాజాగా రిలీజ్ డేట్ ప్రకటిస్తూ ఓ పోస్టర్ విడుదలచేశారు. దర్శకుడు రామ్ దేశిన తెరకెక్కిస్తున్న ఈ చిత్రంలో నాగశౌర్య సరసన విధి యాదవ్ హీరోయిన్‌గా నటిస్తున్నారు. హారీష్ జయరాజ్ ఈ సినిమాకు సంగీతాన్ని అందిస్తున్నారు. సాయికుమార్, సముద్రఖని కీలక పాత్రలు పోషిస్తున్నారు. ఈ చిత్రాన్ని శ్రీ వైష్ణవి ఫిల్మ్స్ బ్యానర్‌పై శ్రీనివాసరావు చింతలపూడి నిర్మిస్తున్నారు.



# ఐపిఎల్ షెడ్యూల్ విడుదల

### - రేపటినుంచి సీజన్-19 ప్రారంభం



ముంబయి: ఇండియన్ ప్రీమియర్ లీగ్(ఐపిఎల్) సీజన్-19 పూర్తి షెడ్యూల్ విడుదలైంది. ఐదు రాష్ట్రాల్లో జరిగే అసెంబ్లీ ఎన్నికల దృష్ట్యా ఏప్రిల్ 12వరకు మాత్రమే తొలి దఫా షెడ్యూల్‌ను విడుదల చేయగా.. టోర్నీ ప్రారంభానికి రెండ్రోజుల ముందు ఐపిఎల్ మ్యాచ్‌ల పూర్తి షెడ్యూల్‌ను భారత క్రికెట్ కంట్రోల్‌బోర్డు(బిసిసిఐ) విడుదల చేసింది. దీంతో ఏప్రిల్ 13 నుంచి జరిగే ఐపిఎల్ రెండో దశ మ్యాచ్‌ల షెడ్యూల్ కూడా విడుదలైంది. టోర్నీ ప్రారంభానికి ముందు ఐపిఎల్ కెప్టెన్లతో బిసిసిఐ సమావేశమైంది. ఈ సమావేశంలో క్యాచ్‌ల రివ్యూలపై సుదీర్ఘ చర్చ నడించింది. అలాగే కాంకషన్ సబ్‌స్టిట్యూట్ ఆటగాడిని కొనసాగిం చేందుకు ఫ్రాంచైజీలు విముఖత చూపడంతో ఈ సీజన్ నుంచి దానిని తొలగించారు.

ఏప్రిల్ 13 నుంచి రెండో విడత లీగ్ జరగనుండగా మే 24న ఢిల్లీ-కోల్‌కతా జట్ల మధ్య జరిగే మ్యాచ్‌లో సీజన్-19 లీగ్ మ్యాచ్‌లు ముగియనున్నాయి. ఆ తర్వాత జరిగే ప్లే ఆఫ్స్ తేదీలను బిసిసిఐ ఇంకా వెల్లడించలేదు. సీజన్-19 ప్రారంభానికి ముందు ఐపిఎల్ కెప్టెన్లతో బిసిసిఐ చిట్ చాట్ సమావేశం ఏర్పాటు చేసింది. ఈ సమావేశం అనంతరం బిసిసిఐ తొలి విడత ఐపిఎల్‌కు కొనసాగింపుగా రెండో దశ షెడ్యూల్‌ను వెల్లడించింది. రెండో దశలో 12 వేదికల్లో 50 మ్యాచ్‌లు జరుగుతాయని తాజా ప్రకటనలో పేర్కొంది. వీటిలో ఎనిమిది డబుల్ హెడర్స్ మ్యాచ్‌లు ఉంటాయని, మధ్యాహ్నం 3:30 గంటలకు ఒకటి, రాత్రి 7:30 గంటలకు రెండో మ్యాచ్ జరుగుతుందని ఫ్రాంచైజీలకు బిసిసిఐ సెక్రటరీ దేవజిత్ సైకియా స్పష్టం చేశారు. రెండో దశలో తొలి మ్యాచ్ ఏప్రిల్ 13న సన్‌రైజర్స్ హైదరాబాద్, రాజస్థాన్ రాయల్స్ మధ్య జరుగుతుంది. పంజాబ్ కింగ్స్ జట్టు తమ హోమ్ మ్యాచ్‌లను న్యూ చంఢగీఢ్‌లో ఆడనుంది. లీగ్ దశలో మూడు మ్యాచ్‌లు ధర్మశాలలో, రాజస్థాన్ సొంత గడ్డ అయిన జైపూర్‌లో నాలుగు మ్యాచ్‌లు జరుగుతాయి. డిఫెండింగ్ ఛాంపియన్ ఆర్సీబీ చిన్నస్వామి స్టేడియంలో మూడు, రారుపూర్‌లో రెండు మ్యాచ్‌లు ఆడనుంది.

**హాట్‌కేకుల్లా అమ్ముడైన టికెట్లు...**

28న చిన్నస్వామి స్టేడియంలో జరిగే ఆరంభ మ్యాచ్ టికెట్లన్నీ హాట్‌కేకుల్లా అమ్ముడయ్యాయి. గత ఏడాది తొక్కిసలాట ఘటనతో మూత పడిన చిన్నస్వామి స్టేడియం దాదాపు పది నెలల తర్వాత తొలి మ్యాచ్‌కు సిద్ధం కానుంది. దీంతో ఈ స్టేడియంలో జరిగే తొలి మ్యాచ్‌ను చూసేందుకు అభిమానులు పోటీపడి టికెట్లు కొనుగోలు చేశారు. సన్‌రైజర్స్ హైదారబాద్, రాయల్ ఛాలెంజర్స్ బెంగళూరు జట్ల మధ్య తొలి మ్యాచ్ జరగనుంది. ఆర్సీబీని రూ.16వేల కోట్లకు దక్కించుకున్న కొత్త యాజమాన్యం కర్నాటక క్రికెట్ సంఘంతో కలిసి మ్యాచ్‌ను విజయవంతం 40 వేల మంది సామర్థ్యమున్న స్టేడియంలో భద్రతా పర్యవేక్షణకు బెంగళూరు ఫ్రాంచైజీ అధిక ప్రాధాన్యం ఇవ్వనుంది.

# జనవరిలో బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ

**- టీమిండియా స్వదేశీ సీజన్ 2026-27 షెడ్యూల్ విడుదల**

**- నాలుగు దేశాలతో 22 మ్యాచ్లు**



ముంబయి : 2026-27 ఏడాదికి భారత పురుషుల క్రికెట్ జట్టు స్వదేశంలో ఆడే అంతర్జాతీయ షెడ్యూల్ను భారత క్రికెట్ కంట్రోల్బోర్డు (బిసిసిఐ) గురువారం విడుదల చేసింది. ఈ సీజన్లో భాగంగా భారత్ జట్టు వెస్టిండీస్, శ్రీలంక, జింబాబ్వే, ఆస్ట్రేలియా జట్లకు ఆతిథ్యం ఇవ్వనుంది.

మొత్తం 17 నగరాల్లో 22 అంతర్జాతీయ మ్యాచ్లు జరగనున్నాయి. సెప్టెంబర్ 27న వెస్టిండీస్ టూర్ స్వదేశీ సిరీస్ ప్రారంభం కానుంది. ఈ సిరీస్లో మూడు వన్డేలు, ఐదు టి20లు జరుగుతాయి. వన్డే మ్యాచ్లు తిరువనంతపురం, గౌహతి, న్యూ చండీగఢ్ జరగనుండగా.. టి20లు లక్నో, రాంచీ, ఇండోర్, హైదరాబాద్, బెంగళూరు ఆతిథ్యమివ్వనున్నాయి. ఆ సిరీస్ తర్వాత డిసెంబర్ 2026లో శ్రీలంక జట్టు భారత్కు వచ్చి మూడు వన్డేలు, మూడు టి20లతో కూడిన వైట్బాల్ సిరీస్ ఆడనుంది. వన్డేలు ఢిల్లీ, బెంగళూరు, అహ్మదాబాద్లో జరుగుతాయి. టీ20 మ్యాచ్లు రాజ్కోట్, కటక్, పుణే నగరాల్లో జరుగుతాయి. ఇక 2027 ప్రారంభంలో జింబాబ్వే జట్టు భారత పర్యటనకు వచ్చి మూడు వన్డే మ్యాచ్లు ఆడనుంది. ఈ మ్యాచ్లు కోల్కతా, హైదరాబాద్, ముంబయి నగరాల్లో జరుగుతాయి. స్వదేశీ సీజన్లో భాగంగా బోర్డర్-గవాస్కర్ ట్రోఫీ టెస్ట్ సిరీస్లో భారత్-ఆస్ట్రేలియా జట్లు తలపడనున్నాయి. ఐదు టెస్ట్ మ్యాచ్లతో కూడిన ఈ సిరీస్ జనవరి 21, 2027న నాగ్పూర్లో ప్రారంభమవుతుంది. ఈ మ్యాచ్లు చెన్నై, గౌహతి, రాంచీ, అహ్మదాబాద్లో మ్యాచ్లు జరుగుతాయి.



శ్రీరామనవమి వేడుకలలో

## ఎంపీ అవినాష్ రెడ్డి ప్రత్యేక పూజలు



**పులివెందుల - సూర్య వాస్తవం**

పులివెందుల పట్టణ పరిధిలోని వాడవాడలా రామాలయాలలో శ్రీరామనవ మి పండుగను పురస్కరించుకొని శుక్రవారం సీతారాముల కల్యాణం వైభవంగా భక్తిప్రపత్తులతో జైశ్రీరాం నినాదాల నడుమ కమనీయంగా సాగింది, పులివెందుల పట్టణ పరిధిలోని రామాలయాల నిర్వాహకుల ప్రత్యేక ఆహ్వానం మేరకు,శ్రీ రామ నవమి పండుగ పురస్కరించుకుని పార్లమెంట్ సభ్యులు వైయస్ అవినాష్ రెడ్డి , వైయస్ మనోహర్ రెడ్డి వైసిపి నాయకులు పులివెందుల పట్టణం మరియు వేల్పుల గ్రామం లోని రామాలయ దేవాలయాలను సందర్శించి ప్రత్యేక పూజ కార్యక్రమాలు నిర్వహించారు. కార్యక్రమాల్లో భాగంగా వేల్పుల గ్రామంలో పులివెందులలోని కొత్త ఆర్టీసీ బస్టాండ్ ప్రక్కన ఉన్న శ్రీ ఆంజనేయ స్వామి గుడి మార్కెట్ యార్డ్ దగ్గర భాకరాపురం లోని శ్రీ రామాలయం నందు, స్థానిక నగరి గుట్ట లోని శ్రీ సీతారామాలయం నందు పాల్గొని శ్రీ రాముడి ఆశీస్సులు తీర్థ ప్రసాదాలు అందుకు న్నారు. ఈ సందర్భంగా ఎంపీ అవినాష్ రెడ్డి మాట్లాడుతూ ముందుగా ప్రతి ఒక్కరికి సీతారాముల ఆశీస్సులు కలగాలని శ్రీరాములు శుభాకాంక్షలు తెలిపారు. రాముల వారి ఆశీస్సులతో రానున్న రోజుల్లో అన్ని మంచి రోజులు వస్తాయని జగనన్న మళ్ళీ ముఖ్యమంత్రి అవ్వడం తథ్యమని, ప్రతి కార్యకర్తకు నాయకునికి తోడుగా అండగా నిలుస్తారని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆయా ఆలయాల నిర్వాహకులు, వైసిపి నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

దశావతారాలలో ఏడవ అవతారం రామావతారం

# శ్రీరామచంద్రుడు ఆదర్శ మానవుడు

## - డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి



**వేంపల్లె - సూర్య వాస్తవం**

దశావతారాల్లో రామావతారం ఏడవ అవతా రం అని, శ్రీరామచంద్రుడు ఒక పురుషోత్తముడని, ఆదర్శ పాలకుడని రాజ్యసభ మాజీ సభ్యులు, కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర మీడియా చైర్మన్ డాక్టర్ నర్రెడ్డి తులసి రెడ్డి అన్నారు. శుక్రవారం వేంపల్లి లో కాంగ్రెస్ నాయకులు శ్రీరామనవమి పండుగను ఘనంగా నిర్వహించారు. తులసి రెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ అందరికీ పానకం,వడపప్పు పంచిపెట్టారు. ఈ సందర్భంగా తులసి రెడ్డి మాట్లాడుతూ సమాజంలో ధర్మం నశించినప్పుడు, అధర్మం విజృంభించి నప్పుడు, దుష్ట శిక్షణ శిష్ట రక్షణ కోసం శ్రీ మహావిష్ణువు భూమి మీద అవతరిస్తాడని,వాటినే దశావతారాలు అంటారని అన్నారు. శ్రీ మహా విష్ణువు దశావతారాల్లో ఏడవ అవతారం రామావతారం అన్నారు, త్రేతాయుగం లో రావణ కుంభకర్ణాది రాక్షసులను, దుర్మార్గులను సంహరించి సమాజాన్ని రక్షించేందుకు శ్రీ మహావిష్ణువు శ్రీరామునిగా అవతరించాడన్నారు. శ్రీరామునికి నవమికి ఎంతో అవినాభావ సంబంధం ఉందన్నారు. శ్రీరామచం ద్రుడు నవమి రోజు భూమి మీద అవతరించారు. నవమి నాడు సీతమ్మ తల్లిని పరిణయం ఆడాడు. రావణ సంహార అనంతరము నవమినాడు అయోధ్యలో పట్టాభి షిక్తుడయ్యాడు. ఆ విధంగా నవమికి శ్రీరామచంద్రునికి విడదీయ రాని బంధం ఉంది అన్నారు. శ్రీరామ చంద్రుడు ఒక ఉత్త మమైన మానవుడు. పితృ వాక్య పరిపాలకుడు. ఏకపత్నీ వ్రతుడు. ఒకే భార్య, ఒకే బాణం,ఒకే మాట ఇవి రాము నికి పర్యాయపదాలు. శ్రీరామచంద్రుడు ఆదర్శ పాలకు డు. రామరాజ్యంలో దొంగతనాలు, వ్యభిచారాలు,మోసం ఉండేవి కావట! ప్రజలు సుఖశాంతులతో, శాంతి సౌభాగ్యాలతో విలసిల్లేవారట. అందువల్ల యుగాలు మారినా, రాజులు మారినా నేటికీ ప్రజలు రామరాజ్యం కావాలని కోరుకుంటారు. స్వాతంత్ర అనంతరం భారతదేశంలో రామరాజ్యం విలసిల్లాలని జాతిపిత పూజ్య బాపూజీ కలలు కన్నాడు. ఆయన కన్న కలలను నిజం చేసేందుకు శ్రీరామనవమి పర్వదిన సందర్భంగా ప్రతి ఒక్కరూ అంకితం, పునరంకితం కావాలని తులసి రెడ్డి విజ్ఞప్తి చేశారు.

ఈ కార్యక్రమంలో తులసిరెడ్డి సతీమణి నర్రెడ్డి అలివేలమ్మ కాంగ్రెస్ పార్టీ జిల్లా ఉపాధ్యక్షులు డాక్టర్ సుబ్రహ్మణ్యం, పులివెందుల నియోజకవర్గ ఇంచార్జ్ ధ్రువ కుమార్ రెడ్డి, వేంపల్లి మండల శాఖ అధ్యక్షుడు రామకృష్ణ,సీనియర్ కాంగ్రెస్ నాయకులు అమర్నాథ్ రెడ్డి, ఉత్తన్న, బద్రీనాథ్, వినయ్ తదితరులు పాల్గొన్నారు.

## రమణీయంగా శ్రీ సీతారాముల కల్యాణోత్సవం



**వేంపల్లె – సూర్య వాస్తవం**

శ్రీరామనవమి పురస్కరించుకుని వేంపల్లె పట్టణంలోని 122 చరిత్ర గల శ్రీ వాసవి కన్యకాపరమేశ్వరి దేవస్థానంలో శ్రీరామనవిమి ఉత్సవాలు 3రోజుల పాటు నిర్వహిస్తున్నట్లు ఆర్యవైశ్య సంఘం అధ్యక్షుడు తోటంశెట్టి చంద్రశేఖర్,ఆర్యవైశ్య యువజన సంఘం అధ్యక్షులు రాయవరం సుబ్బు తెలిపారు. ఉత్సవాల్లో భాగంగా మొదటి రోజు ఆలయంలో వెలసిన 51 సంవత్సరాలు చరిత్ర గల శ్రీ సీతారాముల వారికి ఆలయ అర్చకులు సువర్ణ కంకణ బిరుదాంకిత ఇంద్రకంటి ప్రసాద్ శర్మ సిద్ధాంతి నేతృత్వంలో శాశ్వత ఉభయదారులు కీ.శే.బైరిశెట్టి గంగిశెట్టి కుటుంబ సభ్యులచే శ్రీ సీతారాముల కల్యాణోత్సవం వేద మంత్రోచ్చరణతో తాళమేలాల మధ్య కడు రమణీయంగా, నిర్వహించామని తెలిపారు. అంతక ముందు వేంపల్లె పట్టణ పురవీధుల్లో శ్రీ సీతారాముల వారి గ్రామోత్సవం నిర్వహించామని తెలిపారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామివారిని కల్యాణోత్సవంలో పాల్గొని మాంగళ్యధారణ ఘట్టాన్ని తిలకించారు. భక్తులకు వడపప్పు, పానకం పంచారు. ఈ కార్యక్రమంలో బైరిశెట్టి వెంకటకృష్ణయ్య,బైరిశెట్టి బాల గంగాధర్, సునీల్ ఆర్యవైశ్య సంఘం,ఆర్యవైశ్య యువజన సంఘం,శ్రీ వాసవి కళ్యాణ మండపం, అవోపా, ఆర్యవైశ్య మహిళా మండలి, కార్యవర్గ సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

# పాల్తూరులో భారీ అగ్నిప్రమాదం..

## అగ్ని ప్రమాదం నివారణకు ఆర్థిక శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ తక్షణ చర్యలు



**ఉరవకొండ - సూర్య వాస్తవం**

ఉరవకొండ నియోజకవర్గం విడపనకల్లు మండలం పాల్తూరు గ్రామంలో శుక్రవారం మధ్యాహ్నం భారీ అగ్ని ప్రమాదం జరిగింది. అగ్నిప్రమాదం విషయం రాష్ట్ర ఆర్థిక, ప్రణాళిక, వాణిజ్య పన్నులు శాసనసభ వ్యవహారాల శాఖ మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి రాగా, మంత్రి తక్షణమే స్పందించి అగ్నిప్రమాద నివారణకు తగిన చర్యలు తీసుకున్నారు. వేసవికాలం కావడం వలన ప్రమాదవ శాత్తు పాల్తూరు గ్రామంలో పలువురి రైతుల గడ్డివాములకు భారీ అగ్ని ప్రమాదం చోటు చేసుకుని కాలిపోతుండగా, గ్రామస్తులు, నాయ కులు ఈ విషయాన్ని మంత్రి పయ్యావుల కేశవ్ దృష్టికి తీసుకెళ్లారు. వెంటనే మంత్రి స్పదించి ఫైర్ శాఖ అధికారులతో మాట్లాడి రాయదుర్గం, కళ్యాణ దుర్గం, ఇతర ప్రాంతాల నుంచి ఫైర్ ఇంజన్లను రప్పిం చేం



దుకు చర్యలు తీసు కున్నారు. రాయదుర్గం, కళ్యాణ దుర్గం నుంచి వేగ వంతంగా ఫైర్ ఇంజన్ల ను తీసుకు వచ్చేలా మంత్రి కృషి చేశారు. మరిన్ని గడ్డి వాములకు అగ్నిప్రమాదం జరగకుండా ఫైర్ ఇంజన్లతో వాటిని ఆర్పి వేసేందుకు చర్యలు తీసుకు న్నారు. అలాగే విద్యుత్ శాఖ అధికారు లతో మాట్లాడి మంటలు పూర్తిగా అదుపు చేసేందుకు నీటి సరఫరా అవసరం ఉందని, పాల్తూరు గ్రామానికి 3 ఫేస్ విద్యుత్ సరఫరా చేయాలని మంత్రి ఆదేశించారు. మంత్రి ఆదేశాల మేరకు విద్యుత్ శాఖ అధికారులు పాల్తూరు గ్రామానికి 3 ఫేస్ విద్యుత్ సరఫరా చేయడానికి చర్యలు తీసుకుని విద్యుత్ సర ఫరా చేస్తున్నారు. దీంతో మంత్రి పయ్యావుల కేశవ్ కి గ్రామస్తులు కృతజ్ఞతలు తెలియ జేశారు. అలాగే అగ్ని ప్రమాదంలో గడ్డివాము లు దగ్ధమైన ఆదుకోవాలని విన్నవించారు.

PRINTED AND PUBLISHED OWNED BY MOGAL IRSHAD BAIG, ON BEHALF OF IRS PUBLICATIONS
ADDRESS : # DOOR NO-4-29-A-19-12-, DONTHI STREET, MADANAPALLI, ANNAMAYYA, CHITTOOR,
ANDHRA PRADESH - 517325. CELL : 9948461699 ( ASSOCIATE EDITOR -N.ARIF ALI )